తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
బుధవారం
23 సెప్టెంబర్ 2026
పేజీలు : 8
Follow :

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

## ఖాన్ ఖాన్ పేట 4 వార్డులో విగ్నేశ్వరుని కి ప్రత్యేక పూజలు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





కల్లూరు సెప్టెంబర్22(జనం సాక్షి)
సమస్త విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో, ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో సంపూర్ణ ఆయురారోగ్యాలతో పాడిపంటలతో వర్ధిల్లాలని, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కల్లూరు మున్సిపాలిటీ పరిధి ఖాన్ ఖాన్ పేట 4వ వార్డులో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, నాల్గవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ భూక్యరాంబాయి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తదితరులతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగాప్రత్యేక పూజలు నిర్వహించి అర్చక పండితుల ఆశీర్వాదం తీసుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమమును ప్రారంభించి స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ కమిటీ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదిరాజు అన్నంరాజు, కె.వి.ఆర్ చౌదరి, ఏనుగు సత్యంబాబు, వై కంటి శ్రీనివాసరావు, ఆళ్లకుంట నరసింహారావు, ధరావత్ రవికుమార్, బొల్లం శంకర్ గౌడ్, జంగా పిచ్చి రెడ్డి, యాసా శ్రీకాంత్, కాటేపల్లి కిరణ్, రాజబోయిన శ్రీనివాసరావు, పలువురు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, ఉబ్బన రాంబాబు, దాసరి సుధారాణి, గుండ్ల పుల్లారావు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలను దర్శించుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### కుబేర ఆంజనేయ స్వామికి పొంగులేటి ప్రత్యేక పూజలు



పెనుబల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)
రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం పెనుబల్లి శ్రీ కుబేర ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కమిటీలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణనాధుని పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి వెంట రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పోలీస్ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తులు పాల్గొన్నారు.

## వినయ్ భాస్కర్ పై దాడిని ఖండించిన ఎంపీ వద్దిరాజు



ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)
వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌పై పోలీసులు దాడి చేయడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. ఎంజీఎంలో ఇటీవల పైకప్పు పెచ్చులు ఊడి గాయపడిన రోగులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకుని దాడికి దిగడం దారుణం, దుర్మార్గం అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.గాయాల పాలైన రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు, పరామర్శించడానికి ఆస్పత్రికి వెళ్లిన ప్రధాన ప్రతిపక్షానికి చెందిన సీనియర్ నాయకుడిపై పోలీసులు అమర్యాదగా వ్యవహరించడం,దౌర్జన్యం చేయడం, కాంగ్రెస్ గుండాల మాదిరిగా దాడికి దిగడం బాధాకరమన్నారు.పోలీసులు వినయ్ భాస్కర్ ను కడుపులో తన్నడం,చేయి విరిగేలా దాడి చేయడం క్షమించలేమని ఎంపీ రవిచంద్ర అన్నారు.వినయ్ భాస్కర్‌పై జరిగిన దాడికి హోంమంత్రిగా కూడా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే పూర్తి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని,బాధ్యులైన పోలీసులపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని,కఠిన చర్యలు తీసుకోవాలని, గాయపడిన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీ వద్దిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మారెళ్లపాడుకు ముగ్గురు మంత్రుల రాక!

○23న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవం..
○పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం..




వార్తా 2వ పేజీలో



## స్మార్ట్ కార్డుతో ఎక్కడైనా రేషన్ పొందవచ్చు

### ఎమ్మెల్యే పద్మావతి

**చిలుకూరు, సెప్టెంబర్ 22(జనంసాక్షి):**
మంగళవారం మండల కేంద్రములోని శ్రీ వేంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ కార్డుల విధానాన్ని తీసుకువచ్చిందని, స్మార్ట్ కార్డు పై ఉన్న క్యూఆర్ కోడ్ ఆధారంగా రాష్ట్రంలో ఎక్కడ నుంచి అయినా రేషన్ కార్డు బియ్యం పొందే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రజలు అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. పేద ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ, తాసిల్దార్ ధ్రువ కుమార్, ఎంపిడివో ముక్కపాటి నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీత వెంకన్న, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాదె లింగయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వికసించిన అరుదైన నాగలింగ పుష్పం



**నేరేడుచర్ల, సెప్టెంబర్ 22(జనంసాక్షి):**
నాటిన 13 సంవత్సరాల తర్వాత నాగలింగం చెట్టు శివలింగం ఆకారంలో నాగలింగ పుష్పాన్ని పూసిందని యజమాని కట్టా.లవన్ కుమార్ రెడ్డి తెలిపారు.ఈ సంఘటన నేరేడుచర్ల లోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో జరిగింది.నాగలింగ పుష్పం ప్రత్యేకత ఏంటి అంటే,పువ్వు మధ్య భాగంలో శివలింగాన్ని పోలిన నిర్మాణం కనిపిస్తుంది.దాని చుట్టూ నాగుపాము పడగను పోలిన ఆకృతి ఉన్నట్లు కనిపించడం వల్ల దీనికి "నాగలింగ పుష్పం" అనే పేరు వచ్చింది.ఈ కారణంగా హిందూ సంప్రదాయంలో దీనికి శివారాధనతో ప్రత్యేక సంబంధం ఉందని భావిస్తారు.ముఖ్యంగా శివాలయాల్లో పూజకు, అలంకరణకు ఈ పుష్పాలను ఉపయోగించే సంప్రదాయం కొన్ని ప్రాంతాల్లో ఉంది.పువ్వు సాధారణ పుష్పాల కంటే చాలా భిన్నంగా, పెద్దదిగా మరియు ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ చెట్టు పుష్పాలు సాధారణంగా కాండం లేదా బలమైన కొమ్మల నుంచి నేరుగా గుత్తులుగా రావడం దీని మరో ప్రత్యేకత.



## రోడ్డు నిర్మాణంలో ఇసుక కు మసిబూసి మారేడుకాయ!

○పూసలపాడులో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
○కంకర పొడితోనే సిమెంట్ రోడ్డు నిర్మాణం
○అధికారుల సమాధానాలపై మండిపడుతున్న గ్రామస్థులు

**మాడుగులపల్లి సెప్టెంబర్ 22 ( జనంసాక్షి ):**
మండల పరిధిలోని పూసలపాడు గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది రోడ్డు నిర్మాణంలో ఉపయోగించాల్సిన నది ఇసుక స్థానంలో పూర్తిగా నాణ్యత లేని కంకర పొడి (క్రషర్ డస్ట్) ఉపయోగిస్తుండటంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లు పనులు చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్ల లాభాపేక్షకు అధికారులు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మిగతా 11లో

# మిల్లర్లపై దాడులను నిలిపివేసి ప్రభుత్వం చర్చలు జరపాలి

## రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండమీది గోవిందరావు



**సూర్యాపేట (జనంసాక్షి):**
రైస్ మిల్లర్లపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, టాస్క్ ఫోర్స్ ఆకస్మిక దాడులను వెంటనే నిలిపివేసి మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు జరిపి పరిష్కరించాలని రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండమీది గోవిందరావు, కార్యదర్శి నరసింహరావు డిమాండ్ చేశారు.రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట దీక్షలో పాల్గొని మాట్లాడారు.సీఎంఆర్ ఒప్పందాన్ని ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా రూపొందించాలని అన్నారు.టెస్ట్ మిల్లింగ్ ద్వారా అవుట్ బర్న్ రేషియోను ఖరీఫ్, రబీ పంటలకు వేరువేరుగా నిర్ధారించి, క్వింటాల్ ధాన్యానికి బిల్లింగ్ చార్జీని 150కు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.2014 నుంచి రావాల్సిన సివిల్ సప్లై మిల్లింగ్ ట్రాన్స్ పోర్ట్ డ్రై యేజ్ చార్జీలను చెల్లించి, 25శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీని మాఫీ చేయాలని కోరారు.రైస్ మిల్లులను వ్యవసాయ అనుబంధ సంస్థలుగా గుర్తించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని సరఫరా చేసి, ధాన్యం నాణ్యతకు అనుగుణంగా బియ్యం రేషియోను నిర్ధారించాలని తెలిపారు.ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోయి డిఫాల్ట్ అయిన మిల్లర్లకు లెక్కలు పూర్తిగా తేల్చి బకాయిలు నాలుగు విడతలుగా చెల్లించాలని అన్నారు. ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిగా రా రైస్ గా, రబీ ధాన్యాన్ని పూర్తిగా బాయిల్డ్ రైస్ గా స్వీకరించి, ఎఫ్ సిఐ కఠినమైన నిబంధనలను సడలించి రైస్ మిల్లర్ల 13 డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రా రైస్ మిల్లెట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి వంగవీటి నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు బచ్చు ఉపేందర్, చౌగాని బిక్షపతి, గౌరవ సలహాదారులు కాసాని వెంకటేశ్వర్లు, వజ్ర రైస్ మిల్ నిర్వాహకులు వట్టె జానయ్య యాదవ్, మల్లారెడ్డి, మధు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



## దుప్పెల్లిలో బీఆర్ఎస్ గ్రామశాఖ కమిటీ ఎన్నిక

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి:**
దుప్పెల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆయన సూచించారు. రైతులకు అండగా ఉంటూ, ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల తరఫున పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా పల్సం నర్సయ్య, కార్యదర్శిగా నీల చిన్న ముత్తయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్‌డీ సయ్యద్, మద్దెల ఉప్పలయ్య ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా ముక్కెర లింగస్వామి, యాస వెంకట్‌రెడ్డి, సండ్ల యాదయ్య, ప్రచార కార్యదర్శిగా బాలాగోని వెంకన్న, యువజన అధ్యక్షుడిగా కన్నెబోయిన వెంకటేష్, కార్యదర్శిగా పంగ మహేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## సుభాష్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం



**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి:**
మండల కేంద్రానికి పనిమీద వచ్చి బీటీ కమ్మరి పని చేసుకుంటూ ఎన్నో సంవత్సరాలు గా జీవనం సాగిస్తున్న షోలంకి సుభాష్ (46) ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో అంత్యక్రియలకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలుసుకున్న పలువురు దాతలు స్పందించి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని మంగళవారం సుభాష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉగ్గె నరేష్ , నోముల యాదగిరి, గట్టు రాజు, రాగటి మత్స్యగిరి, ఎండీ మజీద్, తవిటి రాజు, గట్టు శేఖర్, కదిరే దశరథ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన

**నేరేడుచర్ల, సెప్టెంబర్ 22(జనంసాక్షి):**
నేరేడుచర్ల మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకై రాష్ట్ర నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేడు పర్యటించ నున్నారు. నేరేడుచర్ల నుండి దుపాడు వరకు రూ.19.50 కోట్ల తో నిర్మించనున్న నూతన రోడ్డు నిర్మాణంనకు మేడారంలో శంకుస్థాపన చేయ నున్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణలో పట్టణ ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగించే తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధుల ద్వారా రూ.33 లక్షలు వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించనున్నారు.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రావడమే ప్రధాన లక్ష్యం

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ రావడమే తమ ప్రధాన లక్ష్యమని జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు మీసాల గోవర్ధన్ అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్ సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ వెళ్లేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల ఆకాంక్షను గౌరవించి పాత అలైన్‌మెంట్ ప్రకారం బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సూర్యాపేటను విస్మరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కోశాధికారి పి.సామేల్ కిరణ్, నియోజకవర్గ అధ్యక్షులు డేవిడ్ రాజ్ జలగం, పట్టణ అధ్యక్షులు కె.కరుణాకర్, సూర్యాపేట రూరల్ అధ్యక్షుడు జీ.సోలోమెన్ రాజ్, గౌరవ సలహాదారులు జాన్ మార్క్, బాబురావు, జీవరత్నం, లాజర్, ఏసు పాదం, ఏజ్రా, సుదర్శన్ రాజు, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## మర్రిగూడకు ఐదు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

### జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలకు గుర్తింపు.. మండలానికి గర్వకారణం



**మర్రిగూడ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు మర్రిగూడ మండలం నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.
విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు జిల్లా స్థాయిలో వీరిని అవార్డులకు ఎంపిక చేయడం పట్ల మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.అవార్డులకు ఎంపికైన వారిలో ఖుదాబక్షపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి. గోవర్ధన్ (హిందీ ఉపాధ్యాయుడు), మర్రిగూడ తెలంగాణ గురుకుల పాఠశాలకు చెందిన వి. దొరతి (ఆర్థికశాస్త్ర ఉపాధ్యాయురాలు), లెంకలపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన జి. వెంకటేష్ (సహాయక ఉపాధ్యాయుడు), శివన్నగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్. సక్కుబాయి (సహాయక ఉపాధ్యాయురాలు), మర్రిగూడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ఛ. విజయలక్ష్మి (తెలుగు ఉపాధ్యాయురాలు) ఉన్నారు.ఒకే మండలం నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావడం మర్రిగూడ మండలానికి గర్వకారణమని విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. అవార్డు గ్రహీతలకు మండల విద్యాశాఖ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకుని విద్యార్థుల అభ్యున్నతికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ: నరేష్

**మాడ్గులపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**



రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మాడ్గులపల్లి మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్రూరి నరేష్ లబ్ధిదారులకు చెక్కులను స్వయంగా అందజేశారు లబ్ధిదారుల్లో కట్ట రవితేజ రెడ్డికి -60,000, ఇండ్ల సునీతకు ?38,500, ఉరిబిండి యామినీకి ?26,000, సుదనబోయిన రేణుకకు -20,000 చొప్పున ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ అర్రూరి నరేష్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రతకు, ఆపత్కాల సహాయానికి సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు పేద కుటుంబాల సంక్షేమానికి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి, నిధుల మంజూరుకు ప్రత్యేక కృషి చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మాడ్గుల జానకిరాములు , కందుల శ్రీను, దర్శనం కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎండిన పంట పొలాల పరిశీలన

## కన్నెకల్ సబ్ స్టేషన్ వద్ద బిఆర్ఎస్ ధర్నా



**మాడుగులపల్లి సెప్టెంబర్ 22 (జనంసాక్షి ):**
మాడుగులపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎండిపోయిన పంట పొలాలను బిఆర్ఎస్ పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గం, మాడుగులపల్లి మండల పది గ్రామాల ఇంచార్జి పగిళ్ల సైదులు, గారెకుంటపాలెం సర్పంచ్ పెద్ది కృపాకర్ మంగళవారం పరిశీలించారు పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడి పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు అనంతరం కన్నెకల్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నాటు వేసిన పొలాలు ప్రస్తుత ప్రభుత్వ నేరపూరిత, నిర్లక్ష్య చర్యల వల్ల ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు గత కేసీఆర్ ప్రభుత్వంలో 9 ఏళ్లు పంటలు బాగా పండాయని, రైతుల పట్ల ఉన్న ప్రేమ, రైతాంగాన్ని అభివృద్ధి చేయాలనే కృషి వల్ల సమయానికి కాలువల ద్వారా నీటి విడుదల చేయడంతో పాటు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేశారని గుర్తుచేశారు ఆ రోజుల్లో రైతులకు ఎలాంటి నష్టం లేకుండా పంటలు పరిపూర్ణంగా పండి రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు కానీ ఇప్పుడున్న నిర్లక్ష్య కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి పాలనలో రైతులు తీవ్ర నష్టాల పాలై గోస పడే దుస్థితి వచ్చిందని మండిపడ్డారు,ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మేలుకొని రైతుల పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించాలని, కష్టాల్లో ఉన్న రైతులను గట్టెక్కించే దిశగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అలాగే కాలువల్లో నీటిని వెంటనే విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారుఈ కార్యక్రమంలో కన్నెకల్ సర్పంచ్ సర్నాల నాగరాజు, గారెకుంటపాలెం సర్పంచ్ పెద్ది కృపాకర్, గోపాలపురం సర్పంచ్ వీరబోయిన నాగరాజులతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సహజ సిద్ధ వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలి..

**కనగల్లు సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**

రసాయనిక ఎరువులు, పురుగు మందులపై రైతులు ఆధారపడకుండా సహజ వ్యవసాయ పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని జ్యోతి రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ దుడ్లపాల జ్యోతి రెడ్డి కోరారు. మంగళవారం నెమ్మాని గ్రామంలో ఫోరం ఫార్మ్ లేబర టు గ్లోబల్ సంస్థ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ జ్యోతి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు వాటి ఉత్పాదకత, ఉచిత పంపిణీ, సహజ వ్యవసాయ పద్ధతులు, నేల ఆరోగ్యం, సేంద్రీయ ఎరువుల వినియోగం, దేశీయ ఆవుతో ఆధారిత వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు .

# ఉన్నత విద్యతో ఉపాధి అవకాశాలు

## ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాల కిష్టారెడ్డి



**కోదాడ,( జనం సాక్షి):**

కె.ఆర్. ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. విభాగం (జాతీయ సేవా విభాగం),శక్తి యూత్ ఆధ్వర్యంలో "ఉన్నత విద్య–ఉద్యోగ అవకాశాలు"అనే అంశంపై సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాల కిష్టారెడ్డి పాల్గొని ఇంటర్ డిగ్రీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.డిగ్రీ దండగ కాదు పండగ అని, ఈరోజున ప్రపంచానికి భారతదేశం మానవ వనరులను ఉన్నతంగా అందిస్తుందని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా సాంకేతిక రంగం పారిశ్రామిక రంగంలో కూడా ఊహించని కొలువులు లభిస్తాయని అన్నారు. వివిధ డిగ్రీ కోర్సులు, పీజీ కోర్సులు, పీ.హెచ్డీ లు చేసిన వారికి, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్, క్లౌడ్, ఏరోస్ స్పేస్ మొదలైన రంగాలలో రాణించిన వారికి కూడా ఆకర్షణీయమైన, ఉద్యోగాలు, వేతనాలు ఉన్నాయని ఆయన అన్నారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ పెంచుకోవాలని, వృత్తి విద్యా కోర్సులు శ్రద్ధతో చదివితే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఆయన అన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ప్రతి విద్యార్థి సమయాన్ని వృధా చేయకుండా ప్రభుత్వం తీసుకు వస్తున్నటువంటి అనేక విద్యా సంస్కరణలను నిషితంగా పరిశీలిస్తూ ముందుకెళ్లాలని ఆయన అన్నారు. పఠనం ద్వారా జ్ఞానం, ఉపాధి వస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉన్నత విద్యారంగంలో నూతనంగా చేపడుతున్న సంస్కరణలు సిలబస్లో జరిగిన మార్పులను వివరించారు తదనంతరం డిగ్రీ విద్యార్థులకు ఉన్న సిలబస్ అనుమానాలను నివృత్తి చేశారు.

సూర్యాపేట జిల్లా ఇంటర్ విద్యాధికారిణి బి.సులోచన రాణి మాట్లాడుతూ... ఇలాంటి చైతన్య సదస్సులు ఇంటర్ స్థాయిలో జరగడం సంతోషమని ప్రత్యేకంగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ స్వయంగా విద్యార్థులతో మాట్లాడడం ఉత్సాహాన్నిచ్చిందని

ఆమె అన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ తలారి శ్రీనివాసరావు మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిని ఉన్న ఊరును మర్చిపోకుండా మట్టి రుణం తీర్చుకోవాలని పెద్ద చదువులు చదివి సొంత ఊరుకు సేవ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ ఎన్ రమణారెడ్డి వేముల వెంకటేశ్వర్లు రణబోతు పిచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య విమానాశ్రయంగా నామకరణం చేయాలి

## జీ ఎం పీ ఎస్ సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి వజ్జే వినయ్ యాదవ్ డిమాండ్

జాజిరెడ్డిగూడెం మండల **సెప్టెంబర్ 22(జనంసాక్షి):**

వరంగల్ లోని మామునూరులో నిర్మించనున్న విమానాశ్రయానికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం(జీఎంపీ ఎస్ ) డిమాండ్ చేసింది. వరంగల్ విమానాశ్రయానికి పేరు సూచించాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను కోరిన నేపథ్యంలో దొడ్డి కొమురయ్య పేరును పరిశీలించాలని జి ఎం పీ ఎస్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తుంది. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తయి, భూమిని ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి ప్రజల అభిప్రాయాలు అడగడం ఆహ్వానిస్తున్నాము. దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ చరిత్రలో చిరస్మరణీయమైన పేరు. భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో నిలిచారు. ఆయన అమరత్వం తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం సాగిన పోరాట చరిత్రకు ప్రతీకగా నిలిచింది. వరంగల్ ప్రాంతానికి చెందిన ఒక చారిత్రక వ్యక్తి పేరును విమానాశ్రయానికి పెట్టడం ద్వారా తెలంగాణ చరిత్ర, రైతాంగ పోరాట వారసత్వం, సామాజిక న్యాయ విలువలను భవిష్యత్ తరాలకు పరిచయం చేసే అవకాశం ఏర్పడుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి, అలాగే ఆ ఉద్యమానికి నాటి తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తి ఉపయోగపడిందని అన్ని పార్టీల నేతలు అనేక సందర్భాల్లో చెప్పి ఉన్నారు. ఆ అమరుల త్యాగాల ఫలితంగానే నేడు తెలంగాణ ఊపిరి తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం గతంలో కోటి మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి ఐలమ్మ పేరు పెట్టడం, ములుగులోని గిరిజన విశ్వవిద్యాలయానికి సమ్మక్క సారలమ్మ పేరు పెట్టడం అభినందనీయమన్నారు. వీటివల్ల ప్రజాస్వామ్యాన్ని, ప్రజల పోరాటాలను గౌరవించినట్లుగా ఉందని భావిస్తున్నాము. తెలంగాణ అంటేనే రాచరికానికి, దొరతనానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిపిన చైతన్యవంతమైన నేల అన్నారు. అలాంటి నేలకు మళ్లీ రాచరికపు రాజులు, రాణుల పేర్లు పెట్టాలని చర్చ చేయడం సరికాదన్నారు. విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యానికి సంబంధించిన మౌలిక వసతి మాత్రమే కాకుండా, వరంగల్ చారిత్రక సామాజిక గుర్తింపును ప్రపంచానికి పరిచయం చేసే ఒక ముఖ్యమైన వేదికగా మారనున్నందున, దానికి పేరు పెట్టే విషయంలో తెలంగాణ ఉద్యమ, రైతాంగ, సామాజిక చరిత్రకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, దొడ్డి కొమురయ్య పేరును అంతిమ నిర్ణయంగా తీసుకోవాలని కమిటీ కోరింది.

# రైతులు ఈ నెల 30లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి..!

**-రిజిస్ట్రేషన్ లేకుంటే ఎరువులు,రైతు భరోసా, పంట రుణాలు,యంత్ర పరికరాల సబ్సిడీకి దూరం**

**-పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాల్లో నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి పర్యటన**



**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**

రైతులందరూ ఈ నెల 30వ తేదీలోపు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు.మంగళవారం పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాల్లో ఆయన పర్యటించారు.గుడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో కలిసి 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని వీక్షించారు.అనంతరం పి.ఏ.పల్లి మండలంలోని దుగ్యాల గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రతి రైతుకు ఎంతో ముఖ్యమని,గడువులోగా నమోదు చేసుకోవాలని సూచించారు.రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులకు ఎరువుల సరఫరా నిలిపివేయడంతో పాటు రైతు భరోసా,పంట రుణాలు,వ్యవసాయ యంత్ర పరికరాల సబ్సిడీ తదితర వ్యవసాయ శాఖ పథకాల ప్రయోజనాలు అందకుండా పోయే అవకాశం ఉందని తెలిపారు. తదుపరి పుట్టంగండి,ఏకేబీఆర్ ప్రాజెక్టులను అధికారులు పరిశీలించారు.ప్రాజెక్టుల పరిస్థితి, సాగునీటి అంశాలపై సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.ఈ పర్యటనలో దేవరకొండ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీలక్ష్మి,ఇరిగేషన్ ఏఈ జీవేష్,పి.ఏ.పల్లి మండల వ్యవసాయ అధికారి రావుల పాండు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ గుడిపల్లి మండల వ్యవసాయ అధికారి రాజు,వ్యవసాయ విస్తరణ అధికారులు డెబోరా,జ్యోతి,రాజు తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.





# గణనాథుడి దర్శనానికి భక్తుల సందడి

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు,నిర్వాహకులు**

**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 22(జనంసాక్షి):**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపం భక్తులతో సందడిగా మారింది.మండపంలో కొలువుదీరిన గణనాథుడిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. గణపయ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. యువత, స్థానికులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.మండపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో గుడిపల్లి సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ అర్వపల్లి శ్రీనయ్య, వార్డు సభ్యులు నాగరాజు,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఈడబ్ల్యూఎస్ కటాఫ్ మార్కులు తగ్గించాలి రెడ్డి సంక్షేమ సంఘం



**జనంసాక్షి సెప్టెంబర్ (22)ఆత్మకూర్ (ఎం)**

పోలీస్ నియామకాలలో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కటాఫ్ మార్కులను బీసీలతో సమానంగా 50 మార్కులకు తగ్గించాలని రెడ్డి సంక్షేమ సంఘం మండల శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఎస్ఆర్ గార్డెన్లో బొబ్బల ఇంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ కానిస్టేబుల్ నియామకాలకు 7,437 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలకు 40, బీసీలకు 50, ఓసీలకు 60 మార్కుల కటాఫ్ నిర్ణయించారని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు కూడా 60 మార్కులు నిర్ణయించడం అన్యాయమని, బీసీలతో సమానంగా 50 మార్కుల కటాఫ్ నిర్ణయించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రెడ్డి సంఘం నాయకులు యాస లక్ష్మారెడ్డి, వ్యాస ఇంద్రారెడ్డి, వ్యాస బుచ్చిరెడ్డి, మోహన్రెడ్డి, జక్క శివారెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్రెడ్డి, నాగం లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూడో వార్డులో అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

**జనంసాక్షి సెప్టెంబర్ (22)ఆత్మకూర్ (ఎం)**

మూడో వార్డులో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించింది. మురుగునీరు బయటకు వెళ్లక ఇళ్ల ముందు సీసీ రోడ్లపై ప్రవహిస్తూ కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్, ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, పైల్ల ప్రశాంత్, బబ్బురి శివలింగం, బత్తిని నాగయ్యతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.







# నీటి సంరక్షణకై ఫాం పండ్ ను నిర్మించుకోవాలి

## ఎల్ నీ ఓ ప్రభావం కారణంగా యాసంగిలో వరి పంటలు నాటవద్దు

కనగల్లు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)

నీటి సంరక్షణకై రైతులు తమ వ్యవసాయ పంట పొలాలలో ఫాం పండు ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి జితేందర్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వి జి పి పి రామ్ నిధుల ద్వారా భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని నీటి కుంటలు, బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలు, పత్తి కుంటలు రైతులు బాధ్యతగా తీయించుకోవాలని తెలియజేశారు. వీటికి సంబంధించి స్థానిక సర్పంచులు క్షేత్రస్థాయి అధికారులు ప్రజలలో మరింత అవగాహన కల్పించాలని కోరారు. సహజ సిద్ధమైన వ్యవసాయ పంటలను పండించి రసాయనిక ఎరువులను తగ్గించడానికి ఎన్.ఎం.ఎఫ్ ఎన్ ఎఫ్ ద్వారా పగిడిమర్రి గ్రామంలో 125 మంది రైతుల పొలాలలో మట్టి నమూనా పరీక్షలు చేయించడం జరిగిందని ఎంపీడీవో ఏ వేద రక్షిత తెలిపారు. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకుగాను టీవీ ముక్తి భారత్ మిషన్ను త్వరలో అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని ఆమె తెలియజేశారు. ఎఫ్ ఎస్ సి సాధారణరేషన్ కార్డు స్థానంలో డిజిటల్ కార్డు ఇవ్వడం జరుగుతుందని అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి కార్డు ను గ్రామపంచాయతీల వారిగా అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరు గ్రామపంచాయతీ వద్దకు వెళ్లి తీసుకోవాలని తహసిల్దార్ పద్మ సూచించారు.





ప్రభావం తీవ్రంగా ఉన్నందున వచ్చే యాసంగిలో వరి పంటలను నాటవద్దని, ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలని ఏవో అమరేందర్ గౌడ్ తెలియజేశారు. 21047 రైతులకు గాను 16500 మంది రైతులు రైతు గుర్తింపు కార్డులు నమోదు చేయడం జరిగిందని మిగతా రైతులను ఈ నెల చివరినాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి రైతు తమ పేరును నమోదు చేయించుకోవాలని అలా అయితేనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని గుర్తు చేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 3688 మూగజీవాలకు టీకాలు వేయడంతో పాటు 550 పశువులకు గేదెలకు కృత్రిమ గర్భ నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగిందని, సబ్సిడీపై 500 కిలోల గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని డాక్టర్ బాబు సమావేశంలో తెలిపారు. 220 గర్భిణీ స్త్రీలు, 212 బాలింతలు, 1507 ఆరు నెలల నుండి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టిక ఆహారం అందజేయడం తోపాటు అలాగే పోషక మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని సూపర్వైజర్ మంజుల సమావేశంలో వివరించారు. హార్టికల్చర్ ద్వారా మండలంలో ఆయిల్ ఫామ్ సాగుపై 71 మంది రైతులలో సాగు పద్ధతులు, ఆదాయ వివరాలు, పెట్టుబడి, మార్కెటింగ్ సౌకర్యంపై అవగాహన కల్పించి 67 ఎకరముల 22 గుంటల భూమిలో ఆయిల్ ఫామ్ సాగు చేసుకునే విధంగా 38 32 మొక్కలను పంపిణీ చేసి రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని హెచ్ ఓ అనంతరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ ఓ సతీష్ కుమార్, విద్యుత్ ఏఈ సుధాకర్ పిహెచ్సి డాక్టర్ రామకృష్ణ, పి ఆర్ ఆర్ డబ్ల్యు ఏఈలు రామకృష్ణ, షఫీ యుద్దీన్, ఏ పీ ఓ బి సుధాకర్, సర్పంచులు ఓర్సు పెంటయ్య, కారింగ్ జానయ్య గౌడ్, పోచమల్ల సురేష్, రావుల మల్లేష్, గోగు గోవర్ధన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, అందుగుల సువర్ణ వెంకటేశం, కొండా రవళి అంజయ్య, రాజేశ్వరి, పూల కరం అందాలు వెంకటేశం, కట్టెబోయిన సైదయ్య, ముత్తయ్య, ఎడ్ల గీతా గణేష్, కటికనేని నలిని వెంకటేశ్వరరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరాంపురం పాఠశాల భద్రతకు భరోసా

## నాలుగు సీసీ కెమెరాలు , ఉచిత ఇంటర్నెట్ సదుపాయం

తిరుమలగిరి (సాగర్) సెప్టెంబరు 22 (జనంసాక్షి):



శ్రీరాంపురం ప్రాథమిక పాఠశాలకు వజ్ర తేజ రైస్ ఇండస్ట్రీ డైరెక్టర్, దాత చిట్టిప్రోలు వెంకటేశ్వర్లు సహకారంతో నాలుగు సీసీ కెమెరాలు, ఉచిత ఇంటర్నెట్ సదుపాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫరీద్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న దాత చిట్టిప్రోలు వెంకటేశ్వర్లుకు పాఠశాల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సీసీ కెమెరాలు, ఇంటర్నెట్ సదుపాయం విద్యార్థుల భద్రతతో పాటు పాఠశాల అవసరాలకు ఎంతగానో ఉపయోగపడ తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి..

## ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు..



కనగల్లు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వాడవాడలో ఏర్పాటు చేసిన గణనాథుడు నవరాత్రులను అశేష భక్తులచే పూజలందుకొని నిమజ్జనానికి సిద్ధం కావడంతో కూరంపల్లి గ్రామ పక్కనుండే ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ ప్రవహిస్తుండడంతో ప్రధాన కాలువ బ్రిడ్జి సమీపంలో విగ్రహాలను సురక్షితంగా నీటిలో నిమజ్జనం చేయడానికి ఆ ప్రాంతంలో లైటింగ్, భారీ గేట్లు, సీసీ కెమెరాలు, మంచినీటి వసతి లాంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ సిబ్బందిచే గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను ఎంపీడీవో ఏ వేద రక్షిత, ఎస్సై రాజీవ్ రెడ్డి పరిశీలించగా వారి వెంట పంచాయతీ కార్యదర్శి శిరీష, జిపిఓ ఏ కుమార్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



## సీతారాంపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 22(జనంసాక్షి)

జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక సర్పంచ్ చిల్లం చర్ల విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి వేల్పుల రమేష్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్ గౌడ్, ఉప సర్పంచ్ మామిడి శ్రీనివాస్, ఏఎంసి డైరెక్టర్ తాటిపాముల జలంధర్, జలంధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతురాజు శ్రీను, బందెల సైదులు, వార్డు సభ్యులు అంకిరెడ్డి ప్రవీణ్, మాతంగి రేణుక సైదులు, మామిడి మల్లేష్, యువజన కాంగ్రెస్ నాయకులు మాదగాని విక్రమ్, కుంభం నరేష్, ఉదయ్, సైదుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లు బిఎల్ఓ లకు తగు ఆధారాలు సమర్పించాలి

జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 22(జనంసాక్షి)

ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమంలో నోటీసులు అందుకున్న ఓటర్లు బి ఎల్ ఓల కు తగు ఆధారాలు సమర్పించాలని జిల్లా అదరపు కలెక్టర్ హరిసింగ్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సర్ కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు. బీఎల్ఓ లు అర్హులైన వారి ఓట్లు తొలగిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ సమ్మెట అశ్వని, గిర్దావర్లు ప్రసన్న, వెంకటరెడ్డి, బిఎల్ఓలు, జీపిఓలు పాల్గొన్నారు.





# భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు

## బాలు నాయక్

చింతపల్లి, సెప్టెంబర్ 22(జనంసాక్షి)

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చింతపల్లి మండలంలోని చింతపల్లి ఎక్స్‌రోడ్, వింజమూరు ఎక్స్‌రోడ్‌లలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆయా మండపాలను సందర్శించి గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చింతపల్లి ఎక్స్‌రోడ్‌లో వర్తక సంఘం, సాయి గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని గణనాథుడిని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం వింజమూరు ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలోనూ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని భక్తులకు సూచించారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా రెండు ప్రాంతాల్లోని గణేష్ మండపాలు భక్తులు, యువతతో సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో జటావత్ హరినాయక్, ముచ్చర్ల గిరి, అంగిరేకుల నాగభూషణం, కాసారపు శ్రీను, వాంకుడావత్ రవి నాయక్, గుణమోని కొండల్ యాదవ్, నల్లవెల్లి సదానందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, భక్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు...

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

చింతపల్లి, సెప్టెంబర్ 22(జనంసాక్షి)

నల్గొండ జిల్లాలో 2026?27 విద్యా సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన చింతపల్లి మండలానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. కే. శ్రీనివాసులు (గాం?ఇంగ్లిష్), జే. చంద్రయ్య (ఫిజికల్ డైరెక్టర్), జే. పద్మ, వై. పద్మావతి, వై. ప్రణీతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓఅంజయ్య, పిఆర్ టియు అధ్యక్షుడు పి. వాసుదేవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి. యాదయ్య, యూటీఎఫ్ అధ్యక్షుడు సిలివేరు నారాయణ, పాల్గొని అవార్డు గ్రహీతలను సత్కరించారు. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు...



# మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి

○భద్రాద్రి జిల్లాలో 2,190.63 కిలోల గంజాయి స్వాధీనం..
○విలువ రూ.11.20 కోట్లు219 మంది అరెస్టు.. ముగ్గురు పరారీలో

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి అధికారులను మంగళవారం ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్లో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు.జిల్లాలో ఇప్పటివరకు 2,190.63 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, దాని విలువ రూ.11,20,81,500 ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కేసుల్లో మొత్తం 219 మందిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు వివరించారు. ఇప్పటివరకు 65 మందిని మాదకద్రవ్యాల విముక్తి కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలు దుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పద్మావతి అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణాను తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సంబంధిత శాఖలన్నీ ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో పనిచేస్తూ నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు.గత సమావేశం నుంచి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఆర్టీసీ ద్వారా జరిగే అక్రమ రవాణాను అరికట్టేందుకు బస్సు కండక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'మిషన్ పరివర్తన' పథకంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ కార్యాచరణలను వివరించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్. వెంకటేశ్వర్లు, డీఈఓ కార్యాలయ అధికారి రామారావు, జిల్లా రవాణా శాఖ సహాయ మోటారు వాహన తనిఖీ అధికారి శ్వేత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సురక్షిత ఆహారం అందించాలి : జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి

### కల్తీపై కఠిన చర్యలు తీసుకోవాలి

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** సురక్షితమైన ఆహారం, ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా ఆహార భద్రత శాఖ నిరంతరం పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్లో మంగళవారం ఆహార భద్రతపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఆహార భద్రత అధికారి శరత్‌ను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ అనుమతి పత్రం లేదా నమోదు తప్పనిసరిగా పొందాలని శరత్ తెలిపారు.ఆహార వ్యాపార నిర్వాహకులకు అనుమతి పత్రం, నమోదు పొందే ప్రక్రియను సులభతరం చేసేందుకు గతంలో ఆహార అనుమతి పత్రం, నమోదు మేళా నిర్వహించినట్లు తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు, వంటకాల సరఫరా సంస్థలు, బేకరీలు, స్వీట్ షాపులు, కిరాణా దుకాణాలు, వీధి ఆహార విక్రయదారులు, ఆహార తయారీదారులు, టోకు, చిల్లర వ్యాపారులు తదితర ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ మేళాను సద్వినియోగం చేసుకున్నారని, 60 మందికి నమోదు చేసి అనుమతి పత్రాలు మంజూరు చేసినట్లు తెలిపారు.ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు ఆహార భద్రత అనుమతి పత్రం లేదా నమోదు పొందాలని, గడువు ముగిసిన వాటిని పునరుద్ధరించుకోవాలని పద్మావతి సూచించారు. ఆహార వ్యాపారానికి అనుమతి పత్రం లేదా నమోదు ఉండటం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా, వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడంలో కీలకమని అన్నారు.భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు తనిఖీలు నిర్వహించి పర్యవేక్షణ నమూనాలు, అమలు నమూనాలు సేకరించి 59 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ వైద్యులు డాక్టర్ ప్రతాప్, డీఈఓ కార్యాలయ అధికారి రాజ్‌కుమార్, డీపీఓ కార్యాలయ అధికారి ఉమర్ ఫర్, ఆహార విశ్లేషకుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సేవలకు గుర్తింపు.. ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

### - మండల విద్యాధికారి ధన్నె రాజు

### జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అభినందనల వెల్లువ

**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** విద్యారంగంలో విశిష్ట సేవలు అందించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్న ఉపాధ్యాయులను నల్లగొండ యందు హైదరాబాద్ రోడ్డులోని లక్ష్మీ గార్డెన్స్ ఏసీ ఫంక్షన్ హాల్ యందు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను శాలువాతో సత్కరించి,పుష్పగుచ్చం అందజేషి మండల విద్యాధికారి ధన్నె రాజు అభినందనలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుడి సేవలు ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు.జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ,భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యాభిమానులు తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.





## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సతీష్‌కు ఘన సన్మానం

**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 22(జనంసాక్షి)** పి.ఏ.పల్లి మండలం నూతనంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఆడెపు సతీష్ మాదిగకు ఘన సన్మానం లభించింది. అంగడిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తూటిపల్లి సత్తమ్మ నాగేష్ ఆధ్వర్యంలో సతీష్ మాదిగను శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఆడెపు సతీష్ మాదిగకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ప్రజల హక్కుల సాధన కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సర్వ మంగళ గౌరీ దేవిగా ఎల్లమ్మ అమ్మవారు

**కనగల్లు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)** ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి సన్నిధిలో శ్రీ వినాయక మాతృమూర్తి పార్వతీదేవి ని సర్వమంగళ దేవిగా ఎల్లమ్మఅమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు నాగోజుమల్లాచారి అలంకరణ చేయగా ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు దివ్యదర్శనం చేసుకున్నారు.వారికి తీర్థ ప్రసాదాలను అందజేయగాభక్తులు తమ ముక్కులను తీర్చుకున్నారు.

## ఎండిపోతున్న పంటలను కాపాడండి

### మాజీ జెడ్పిటిసి : కొప్పుల సైదిరెడ్డి



**హుజూర్ నగర్ రూరల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఎల్‌నినో ప్రభావం కంటే కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతే ప్రధాన కారణమని హుజూర్ నగర్ మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీనివాసపురం, లక్కవరం గ్రామాలలో నీరులేక ఎండిపోతున్న పంట పొలాలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్ని రకాల పెట్టుబడులు పెట్టి వరి పంట వేస్తే పొట్టదశకు చేరుకున్న తరుణంలో నీరులేక ఎండి పోతున్నాయని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిత్యం కరెంటు కోతలతో రైతులను హరిగోస పడుతున్నారని, రైతులకు నాణ్యమైన కరెంటును అందించాలని గతంలో నాగార్జునసాగర్ లో 513 అడుగుల డెడ్ స్టోరేజ్ ఉన్నప్పటికీ ఎడమ కాలువ పరిధిలోని పంట పొలాలకు నీరు అందించి ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగాన్ని ఆదుకున్న చరిత్ర మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిదే అన్నారు. కానీ అందుకు భిన్నంగా నేడు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ జిల్లా రైతాంగానికి ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. సాగర్ లో ఇప్పటికీ 535 అడుగుల నీరు ఉన్నప్పటికీ ప్రభుత్వానికి నీటి విడుదలపై ఒక విధానం అంటూ లేకపోవడం వల్ల వారి అనాలోచిత నిర్ణయాలతో ఎడమ కాలువ కింద రైతుల పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే మన రాష్ట్రం 84 టీఎంసీల నీటిని వాడుకున్నామని, అసెంబ్లీలో అసత్యాలు ప్రస్తావించారన్నారు వాడుకుంటే ఆ నీళ్లు ఎటు పోయాయో ఎక్కడ పారించారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే స్పందించి ఎడమ కాలువకు నీటి విడుదలపై షెడ్యూల్ ప్రకటించి చివరి ఆయకట్టు భూముల వరకు నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గవిని లింగస్వామి, మాజీ సర్పంచ్ యరసాని రామనరసమ్మ, కట్టా సతీష్ కుమార్, గుండెబోయిన శ్రీనివాస్, తుళ్లూరి నరసింహారావు, జింకల వీరబాబు, తోడేటి గంగరాజు, జింకల ఉపేందర్, జడ సైదులు, పిన్నపురెడ్డి రామిరెడ్డి, దుగ్గి నరసింహారావు, అన్నపురెడ్డి వీరారెడ్డి, కొత్త సైదులు, పొదిలి బుచ్చయ్య, రాపోలు వీరబాబు, తోడేటి గంగరాజు, పొదిలి మధు, దాసరి నాగరాజు, సామల కృష్ణారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## మద్దతు ధరకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

### ఈ నెల 30లోగా నమోదు చేసుకోవాలి

### వ్యవసాయ అధికారి అశోక్‌కుమార్

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి సెప్టెంబర్ (22)** రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో మద్దతు ధర పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం తప్పనిసరి అని వ్యవసాయ విస్తరణ అధికారి ముప్పిడి అశోక్‌కుమార్ తెలిపారు. ఆగస్టు 13, 2026 వరకు భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు ఈ నెల 30లోగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు పూర్తయిన రైతులకు 11 అంకెల యూనిక్ ఫార్మర్ ఐడీ కేటాయిస్తారని తెలిపారు. ఈ ఐడీ ద్వారా రైతు, భూమి వివరాలు డిజిటల్‌గా అనుసంధానమై మద్దతు ధరకు పంటల కొనుగోలు, ఎరువుల పంపిణీ, పీఎం-కిసాన్, రైతు భరోసా, వ్యవసాయ యాంత్రీకరణ, పంట బీమా, పంట నష్ట పరిహారం తదితర ప్రభుత్వ పథకాలు, సేవల్లో వివరాల ధ్రువీకరణకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు సమీప మీ-సేవ కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్ లేదా రైతువేదికను సంప్రదించాలని సూచించారు. నమోదు సమయంలో పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకెళ్లాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు తమ ఫార్మర్ ఐడీ స్థితిని అధికారిక వెబ్‌సైట్‌లో ఆధార్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

# బాలికల ఆరోగ్యంపై అవగాహనకు పెద్దపీట

## కేజీబీవీలో మెన్స్ట్రువల్ హైజీన్‌పై అవగాహన కార్యక్రమం



**ఖమ్మం, సెప్టెంబర్ 22 (జనం సాక్షి)**
ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో బేటీ బచావో?బేటీ పడావో్ కార్యక్రమంలో భాగంగా బాలికలకు మెన్స్ట్రువల్ హైజీన్‌పై జిల్లా సంక్షేమ అధికారి ఎ ప్రమీలా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డహెచ్ఈడబ్ల్యూ? డిఎంసి ఎస్ డి సమీరాన్ సిబ్బంది బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, భద్రత, విద్య, సమగ్ర అభివృద్ధిపై అవగాహన కల్పించారు. రుతుస్రావం సహజమైన శారీరక ప్రక్రియ అని, దీనిపై బాలికలు ఎలాంటి సంకోచం లేకుండా సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రుతుస్రావ సమయంలో శానిటరీ ప్యాడ్లను సక్రమంగా ఉపయోగించడం, నిర్ణీత సమయంలో మార్చడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, తగినంత నీరు తాగడం, పోషకాహారం తీసుకోవడం వంటి అంశాలను వివరించారు. అలాగే మహిళా సహాయవాణి 181, బాలల సహాయవాణి 1098, అత్యవసర సహాయవాణి 112 నంబర్లపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, వృత్తి మార్గదర్శకత్వం, విద్య ప్రాధాన్యతను వివరించారు. ఆరోగ్యపరమైన సమస్యలు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైతే నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేసి అవసరమైన సహాయం పొందాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎస్ పి. ప్రమీలా, ఆర్. వసంతి, న్యూ లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ ఎస్.కె. సలీమా, కేజీబీవీ ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, మహిళా సాధికారత విభాగం సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

**- విద్యార్థులకు సర్పంచ్ మందా నాగరాజు సూచన**

**- బూర్గంపహాడ్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్లో స్వచ్ఛత కార్యక్రమం**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**
స్వచ్ఛత, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ సర్పంచ్ మందా నాగరాజు అన్నారు. మంగళవారం బూర్గంపహాడ్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్లో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛతపై ప్రసంగాలు చేయగా సర్పంచ్ వారిని అభినందించారు. సమాజంలో విలువలతో కూడిన విద్యను అందించే ఇలాంటి పాఠశాలలు మరిన్ని అవసరమని, ఈ పాఠశాలపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాలకు అవసరమైన సహాయ సహకారాలను గ్రామపంచాయతీ తరఫున అందిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు, కమిటీ సభ్యురాలు గౌరీ మాధవి, ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల కార్యక్రమాలకు ఆహ్వానం అందిన ప్రతిసారీ హాజరై సహకరిస్తున్న సర్పంచ్ మందా నాగరాజుకు పాఠశాల యాజమాన్యం, కమిటీ సభ్యులు, ఆచార్యులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. "స్వచ్ఛత – మన బాధ్యత.. మొక్కలు – మన భవిష్యత్తు" అనే సందేశంతో కార్యక్రమం కొనసాగింది.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

## అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## మర్రిగూడలో మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమం




**మర్రిగూడ, సెప్టెంబర్ 22 (జనం సాక్షి)**
"మన అంగన్వాడీ?మన బాధ్యత" అనే నినాదంతో మర్రిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని అన్నారు. శరీరానికి అవసరమైన మాంసకృత్తులు, విటమిన్లు, పిండిపదార్థాలు తగిన మోతాదులో లభించే సమతుల్య ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి పోషకాహారం కీలకమని పేర్కొన్నారు.
మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోషకాహార లోపం రాకుండా సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు.
మండల పరిషత్ అభివృద్ధి అధికారి మున్నయ్య మాట్లాడుతూ ఆకుకూరలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు వంటి స్థానికంగా అందుబాటులో ఉన్న పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం పోషకాహారంపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడాలని అన్నారు.
సీడీపీఓ సక్కుబాయి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి కుటుంబం పోషకాహార ప్రాధాన్యతను గుర్తించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ మున్నయ్య, సీడీపీఓ సక్కుబాయి, పర్యవేక్షకురాలు యశోద, మండలంలోని సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిత్యాతండాలో వైభవంగా అన్నదాన కార్యక్రమం

**మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నేతలు**



**మాడుగులపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**
నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం మాడుగులపల్లి మండలం సిత్యాతండా గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు గ్రామ సర్పంచ్ రాయరపు ఉమా వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయ సింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టిబాబు నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి హాజరై వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు స్వయంగా అన్నదానం పంపిణీ చేశారు స్వామివారి కృపతో గ్రా ప్రజలంతా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యా లతో విలసిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో కుక్కడం సర్పంచ్ ప్రసన్నరాబర్ట్,మాడుగుల చుక్కయ్య, కాసుల రమణయ్య, రమావత్ నరేందర్, బొద్దుపల్లి లింగయ్య, సతీష్, వాంకుడోత్ కుమార్, శ్రీను గ్రామ పెద్దలు, బిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్యామల గోపాలన్ AISTA 2026 టోర్నమెంట్ ఘన ముగింపు

## 18 నుంచి 22 వరకు ఉత్కంఠభరితంగా సాగిన జాతీయ స్థాయి సీనియర్ టెన్నిస్ పోటీలు..



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**
పాల్వంచ-కొత్తగూడెం జంట నగరాల వేదికగా ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన శ్యామల గోపాలన్ ఐటా 2026 జాతీయ స్థాయి సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు 35+, 45+, 55+, 65+, 70+, 75+ వయో విభాగాల్లో హోరా హోరీగా పోటీ పడ్డారు. ఆతిథ్య జట్టు నుంచి అన్నం, భాస్కర్, కె. సతీష్, చ. కృష్ణారావులు వివిధ విభాగాల్లో విజేతలు, రన్నర్లుగా నిలిచి సత్తా చాటారు.
ముగింపు కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై వివిధ విభాగాల్లో విజేతలు, రన్నర్లకు బహుమతులు అందజేశారు. క్రీడాకారులు ప్రదర్శించిన క్రీడాస్ఫూర్తిని, టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. విజేతలు: 75+ డబుల్స్‌లో యాబౌ రాజు?వై. భాస్కర్‌రావు; 70+ సింగిల్స్‌లో ధనుంజయ, డబుల్స్‌లో కే. విజయకృష్ణకుమార్?టి.వి. నాయుడు; 65+ సింగిల్స్‌లో వి. శ్రీనివాస్‌రెడ్డి, డబుల్స్‌లో ఆనంద స్వరూప్?టి. శ్రీనివాస్; 55+ సింగిల్స్‌లో కేవీఎన్ మూర్తి, డబుల్స్‌లో కేవీఎన్ మూర్తి?అన్నం; 45+ సింగిల్స్‌లో జి. రమేష్, డబుల్స్‌లో శివరామ్ రాజు?ఎంవీఎల్ఎన్ రాజు; 35+ సింగిల్స్‌లో మేశ్వరరావు, డబుల్స్‌లో కె. సతీష్?చ. కృష్ణారావు విజేతలుగా నిలిచారు. రన్నర్లు: 75+ డబుల్స్‌లో వై.వి. రామకృష్ణ–రాజారతన్; 70+ సింగిల్స్ లో రాధాకృష్ణమూర్తి, డబుల్స్‌లో డి.ఎస్. రావు?పార్థసారథి; 65+ సింగిల్స్‌లో ఎస్.ఎస్. రాథ్, డబుల్స్‌లో వి. శ్రీనివాస్‌రెడ్డి?బి. జోజి రెడ్డి; 55+ సింగిల్స్‌లో ప్రభంజన్ రెడ్డి, డబుల్స్‌లో జి. విజయకుమార్–ఆర్.ఎస్. రాథోడ్; 45+ సింగిల్స్‌లో ఎంవీఎల్ఎన్ రాజు, డబుల్స్‌లో భాస్కర్–గంజి వెంకటేశ్వర్లు; 35+ సింగిల్స్‌లో మూర్తి కృష్ణప్ప, డబుల్స్‌లో మేశ్వరరావు?కురిమిన రవి నిలిచారు.
కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, కమిషనర్ కె. సుజాత, డీవైఅండ్ఎస్ఓ పరంధామరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నాగ సీతారాములు, ఒఎెంఎం చీఫ్ రిటైర్డ్ జడ్జి రామకృష్ణ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు. టోర్నమెంట్‌ను భద్రాద్రి కొత్తగూడెం అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి, కార్యదర్శి జకరయ్య, ఉపాధ్యక్షుడు వై.వి.లు ఆధ్వర్యంలోని భద్రాద్రి కొత్తగూడెం బృందం, ఎస్ ఎస్ ఆర్ బృందం సమన్వయంతో విజయవంతంగా నిర్వహించింది.

# తెలుగు భాషపై గిరిబిడ్డలకు ప్రత్యేక శిక్షణ

- ఐటీడీఏ పీవో రాహుల్ ఆధ్వర్యంలో ..
- వినూత్న పోటీలు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు..

**భద్రాచలం సెప్టెంబరు 22 (జనంసాక్షి):** గిరిజన విద్యార్థుల్లో తెలుగు భాషపై పట్టు పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ప్రత్యేక దృష్టి సారించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో పలు సాంస్కృతిక, సాహిత్య పోటీలను నిర్వహించారు.కవితలు, శీర్షికలు, పద్యాలు, ఒక నిమిషం తెలుగు ప్రసంగం, ఏకపాత్రాభినయం, క్విజ్ తదితర పోటీల్లో గిరిజన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ప్రతిభను చాటుతూ ఆడి పాడిన గిరిబిడ్డలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలుగుతనం ఉట్టి పడేలా సాగిన పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ తెలుగు భాషపై పట్టు



సాధించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని, విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడంతో పాటు మాతృభాషపై మరింత అవగాహన కలుగుతుందని తెలిపారు. "దేశభాషలందు తెలుగు లెస్స" అన్న కవుల మాటలు అక్షర సత్యమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు పీవో ప్రశంసా పత్రాలతో పాటు కవులకు సంబంధించిన చరిత్ర పుస్తకాలను బహుమ తులుగా అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఫిరంగి, భద్రాచలం డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చందన, గురుకులం ఆర్సీవో అరుణకుమారి, ఏసీఎంవోలు రమేష్, రాములు, ఏటీడీవోలు చంద్రమోహన్, రాధమ్మ, భారతీదేవి, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, పీఎంఆర్సీ డీడీ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం బహిరంగ సభకు ఊరు వాడ కదలాలి

**టేకులపల్లి, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** ఖమ్మంలో జరుగు అఖిల భారత రైతు కూలి సంఘం నాలుగవ మహాసభల సందర్భంగా ఈ నెల 28న జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఊరు వాడ కదలాలని గ్రామాలలో అఖిల భారత రైతుకులీ సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఇప్పలచలక, ఎర్రాయిగూడెం, తుమ్మల చలక గ్రామాలలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ గ్రూపు సమావేశాలలో అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి భూక్యా హర్జియా, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావులు మాట్లాడుతూ బహిరంగ సభకు ఇంటికి ఒకరు తరలివచ్చి విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ అఖిలభారత రైతు కూలీ సంఘం మండల సహాయ కార్యదర్శి భూక్య నర్సింగ్, అనంతోజు చంద్ర చారి, చింతా లాలమ్మ, రామనాథం, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాఫ్ సర్వేను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు



**టేకులపల్లి, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** టేకులపల్లి మండలంలో పంటలపై జరుగుతున్న డిజిటల్ క్రాఫ్ సర్వేను మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం సులానగర్ లో జరుగుతున్న డిజిటల్ సర్వేను, ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబూరావు సందర్శించి పరిశీలించారు. టేకులపల్లి మండలంలో మొత్తం 5799 ప్లాట్లు డిజిటల్ మ్యాపింగ్ ద్వారా క్రాప్ బుకింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఫార్మర్ ఐడి నీ ఏ ఈ ఓ వద్ద కానీ, మీ సేవ సెంటర్స్ లో గానీ చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ఇల్లందు వ్యవసాయ సంచాలకులు లాల్చంద్, ఏవో అన్నపూర్ణ,ఏ ఈ ఓ భాగ్య శ్రీ, రైతులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సాధికారిత రాష్ట్ర పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

### : జిల్లా సంక్షేమ అధికారిని అలివేటి ప్రమీల



**ఖమ్మం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా 2026 రాష్ట్ర వయోవృద్ధుల సాధికారిత పురస్కారాల కోసం అర్హులైన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిని అలివేటి ప్రమీల తెలిపారు.వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన సీనియర్ సిటిజన్లు, వయోవృద్ధుల సంక్షేమం, రక్షణ, ఆరోగ్యం, సామాజిక శ్రేయస్సు కోసం సేవలందిస్తున్న వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, విద్యాసంస్థలు తదితరులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారం, మార్గదర్శకాల కోసం www.wdsc. telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి సెప్టెంబర్ 26, 2026 సాయంత్రం 5 గంటల్లోపు హైదరాబాద్ మలక్‌పేట్‌లోని దివ్యాంగుల సంక్షేమ భవన్‌లో ఉన్న సంబంధిత శాఖ కార్యాలయంలో సమర్పించాలి. మరిన్ని వివరాలకు 99516 29372, 9885826161 నంబర్లను సంప్రదించవచ్చు అని ఆమె పేర్కొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

### - బైక్‌పై వెళ్తుండగా నయారా బంక్ వద్ద ఘోర ప్రమాదం



**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం సమీపంలోని నయారా బంక్ వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి.ముసలిమడుగు గ్రామానికి చెందిన గడ్డం సత్యం (55) తన ద్విచక్రవాహనంపై పవన్‌కుమార్‌ను వెనుక కూర్చోబెట్టుకుని లక్ష్మీపురం వైపు వెళ్తుండగా సుమారు మధ్యాహ్నం 2.15 గంటలకు నయారా బంక్ వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు సత్యం బైక్‌తో సహా కిందపడిపోగా, అతని తల లారీ టైర్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న పవన్‌కుమార్‌కు గాయాలయ్యాయి. ఘటనపై మృతుడి కుమారుడు గడ్డం ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

### - వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

### - భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు.. మార్మోగిన హరహర మహాదేవ్ నామస్మరణ

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి)** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బూర్గం పహాడ్ మండలం తాళ్లగొమ్మూరు గ్రామపంచాయతీ పరిధిలోని మహాలక్ష్మమ్మ కాలనీలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీమ్ త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా సాగాయి. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య శివపార్వతుల కళ్యాణం కన్నులపండువగా జరిగింది. ఈ పవిత్ర వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పరమశివుడు, పార్వతీదేవి అమ్మవార్ల కళ్యాణాన్ని భక్తి పారవశ్యంతో తిలకించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శివపార్వతుల అనుగ్రహంతో గ్రామ ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.



## స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

### - స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం..

### - ఎంపీ బంజర ప్రాథమిక పాఠశాలలో 'స్వచ్ఛత హీ సేవ-2026' కార్యక్రమం



**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి)** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛతను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి సూచించారు. బూర్గంపహాడ్ మండలం మోరం పల్లి బంజర గ్రామపంచాయతీ పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 'స్వచ్ఛత హీ సేవ?2026' కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, పాఠశాల సిబ్బందికి తడి చెత్త?పొడి చెత్త వేరు చేయడం, వైద్య వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించి, పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలా రెడ్డి, ఎంపీ ఓ రామకృష్ణ, సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉపసర్పంచ్ పొక్కుల రవి, 7వ వార్డు సభ్యుడు రొండా పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి భవాని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరోమణి, రామారావు, రేవతి, ఏపీవో విజయలక్ష్మి, ఈసీ వెంకట్, టెక్నికల్ అసిస్టెంట్ స్వాతి, రైతు గాదే నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామపంచాయతీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఖమ్మం 43వ డివిజన్‌లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

**ఖమ్మం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)** ఖమ్మం 43వ డివిజన్‌లో శ్రీ బాల గణేష్ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మహిళల ఆధ్వర్యంలో కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరస్వతి పూజను కూడా ప్రత్యేకంగా నిర్వహించి విద్యార్థులు, భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి అందరికీ అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమాలను కమిటీ సభ్యులు పూర్ణ నాయుడు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ నాయుడు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం భక్తుల సహకారంతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు, కార్యక్రమాల విజయానికి సహకరించిన కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# అట్టడుగు పేదల ఐక్యతకు బిజెపినే ఆటంకం : టీ స్కైలాబ్ బాబు

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**
భారత రాజ్యాంగ నిర్మాత అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ పై ఆర్ ఎస్ ఎస్ డైరెక్షన్ బీజేపీ ప్రోద్బలంతో జరుగుతున్న ముప్పేట దాడి విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలోని ఎన్ఎస్పి క్యాంపు సుందరయ్య భవన్ లో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ పై ఆర్ఎస్ఎస్ ముప్పేట దాడి సవాళ్లు కర్తవ్యాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు ప్రధానవత్తగా హాజరైన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానిస్తే సహించేది లేదన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి కాదని, కోట్లాది మంది అణగారిన ప్రజలకు ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం అందించిన మహనీయుడని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పోషించిన చారిత్రక పాత్రను వక్రీకరించి, ఆయనను కల్పిత నాయకుడిగా చిత్రీకరించడం రాజ్యాంగ విలువలను అవమానించడమేనని పేర్కొన్నారు. కుల వివక్ష, అంటరానితనం, అసమానతలకు వ్యతిరేకంగా అంబేద్కర్ సాగించిన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిందన్నారు. పేదల ఐక్యతకు బిజెపినే ప్రధాన ఆటంకంగా నిలుస్తుందన్నారు. నాగపూర్ కేంద్రంగా అంబేద్కర్ ఆలోచనలు కొనసాగుతుంటే అంబేద్కర్ భావాలను పాతాళంలోకి తొక్కడానికి ఆర్ఎస్ఎస్ నాగపూర్ కేంద్రంగానే నాటి నుండే కుట్రలు ప్రారంభించిందన్నారు ఇటీవల ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఉద్యమంలో విద్యార్థులు యువకులు ఒకవైపు భారత రాజ్యాంగాన్ని చేత పట్టుకొని అంబేద్కర్ ఫోటోలు చేత పట్టుకొని ఉద్యమాలు చేపట్టారని దేశవ్యాప్తంగా యువతరం అంబేద్కర్ ప్రేరణగా సాగుతున్న ఉద్యమాలను, అట్టడుగు పేదలను అణిచివేయడానికి బిజెపి ప్రోత్బలంతో జరుగుతున్న కుట్రలు తిప్పి కొట్టాలన్నారు. రాజ్యాంగానికి తిలోదకాలు ఇస్తున్న బిజెపి విధానాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. అంబేద్కర్ పై జరుగుతున్న విష ప్రచారాన్ని దేశం యావత్తు ఖండించాలని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలాన్ని తిప్పి కొట్టాలన్నారు. అంబేద్కర్ ఆలోచనలకు వ్యతిరేకంగా, కుల వివక్షను సమర్థించే మనువాద భావజాలాన్ని ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు.



రాజ్యాంగం రద్దు చేయాలని రిజర్వేషన్ హఠావో అంబేద్కర్ కల్పిత నాయకుడు అంటూ ముప్పేట దాడి ప్రారంభించి అట్టడుగు వర్గాలకు ఐకాన్ గా ఉన్న అంబేద్కర్ పై విష ప్రచారం ప్రారంభించారని చెప్పారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం కల్పించిందని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అంబేద్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని అవమానించడమేనని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను కాపాడుకునేందుకు ప్రజాసంఘాలు, దళితులు, బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చారిత్రక పాత్రను వక్రీకరించే ప్రయత్నాలను అడ్డుకోవాలని అన్నారు అంబేద్కర్ విగ్రహాలు, రాజ్యాంగ ప్రతుల అవమానానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు పాఠశాలలు, కళాశాలల్లో అంబేద్కర్ జీవితం, రాజ్యాంగ విలువలు, సామాజిక సమానత్వంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కుల వివక్ష, అంటరానితనం, మనువాద భావజాలానికి వ్యతిరేకంగా ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు ఆర్ఎస్ఎస్ ముసుగులో సాగుతున్న మనువాద భావజాలాన్ని తిప్పికొడతామని హెచ్చరించారు.

వ్యవసాయ కూలీలు పేదలు హక్కులు పరిరక్షించడానికి రాజ్యాంగం కల్పించిన అవకాశాలను ఆర్ఎస్ఎస్ బిజెపి అడ్డగిస్తుందని అన్నారు. అంబేద్కర్, రాజ్యాంగం, రిజర్వేషన్లజోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీల కోసం చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ఆడిక్లరేషన్ లోని ఒక్క హామీని అమలు చేయలేక పోయిందన్నారు. దళితుల అసైన్డ్ భూములను ఒక్క అంగుళం కూడా గుంజుకోమని చెప్పిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసైన్డ్ భూములన్నింటికీ పట్టాలిస్తామని ఎందుకు మాట్లాడటం లేదని విమర్శించారు తక్షణమే దళితులకు కేటాయించబడిన సైంటి భూములకు పట్టాలి ఇచ్చి సంపూర్ణ హక్కులు కల్పించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల సభ సమయాన్ని అధికార ప్రతిపక్షాలు కూడా బలుక్కొని సమయం దుర్వినియోగం చేస్తున్నాయని విమర్శించారు దళితుల సమస్యలు అసెంబ్లీలో చర్చించమంటే దళితులను అవమానించే చర్యలకు పాల్పడటం స్పీకర్ ను పరుష పదజాలంతో మాట్లాడటం కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద దళితులు నడిచిన స్థలంలో పసుపు నీళ్లు చల్లడం వంటి అనాగరి కాటవిక చర్యలు నేటి ఆధునిక యుగంలో జరగడం శోచనీయమన్నారు. సామాజిక న్యాయాన్ని సాధించడానికి ఆటంకంగా నిలుస్తున్న మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని చెప్పారు. ఈ సెమినార్ లో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఎస్సీ ఎస్టీ కేసుల నష్టపరిహారం తక్షణమే విడుదల చేయాలన్నారు కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు రావలసిన ప్రోత్సాహకాలు కూడా పెండింగ్ లోనే కొనసాగుతున్నాయని విమర్శించారు అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను రాజకీయాలకతీతంగా మంజూరు చేయాలని చెప్పారు. ఈ సెమినార్ లో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తమాల ప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల భారతి, బండి రమేష్ కొమ్ము శ్రీను, నకిరేకంటి చిరంజీవి జిల్లా కమిటీ సభ్యులు చెరుకుపల్లి వీరభద్రం, పగిడి కత్తుల నాగేశ్వరరావు, నోముల పుల్లయ్య, మేడి బిక్షం, ఏపూరి వర కుమార్, ఎస్ కే సైదులు, పగిడిపల్లి వెంకట్రావు, గుమ్మడి బిక్షం, స్వామి, కొమ్ము రాంబాబు, హెచ్ వెంకటేశ్వర్లు, గుడ్ల మంగ, బాలరాజు, అంతోటి రవి కుమార్, ఎం యాదగిరి, నందిపాటి లక్ష్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఇల్లందు ఏరియాలో డిపార్ట్మెంటల్ క్రికెట్ పోటీల్లో కోయగూడెం ఓసీ టీం విజయం

**టేకులపల్లి, సెప్టెంబర్ 22(జనంసాక్షి):**
ఇల్లందు ఏరియాలోని రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో నిర్వహిస్తున్న డిపార్ట్మెంటల్ క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం ఫైనల్ క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితం గా జరిగాయి. ఫైనల్ పోటీలో కోయగూడెం ఓసీ (ఖాఅ) జట్టు, జేకే-5 ఓసీ అండ్ యస్‌డపిసి జట్లు తలపడగా, కోయగూడెం ఓసీ జట్టు విజేతగా నిలిచింది. జేకే-5 ఓసీ అండ్ యస్‌డపిసి జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య విజేత జట్టుకు అభినందనలు తెలిపారు. రన్నరప్‌గా నిలిచిన జట్టు క్రీడాకారులు నిరుత్సాహ పడవద్దని, గెలుపోటములు క్రీడల్లో సహజమని అన్నారు. ఉద్యోగులు విధులతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి కనబరచాలని సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ డిపార్ట్మెంటల్ క్రీడల్లో విజేతగా నిలిచిన కోయగూడెం ఓసీ టీం నుంచి, రన్నరప్‌గా నిలిచిన జేకే-5 ఓసీ అండ్ యస్‌డపిసి టీం, జి.యం ఆఫీసర్ టీం నుంచి క్రీడాకారులను ఎంపిక చేసి ఒక జట్టుగా ఏర్పాటు చేయనున్నట్లు జీఎం తెలిపారు. ఈ జట్టు మణుగూరు ఏరియా జట్టుతో తదుపరి పోటీలో పాల్గొంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిఖూడఉం కో ఆర్డినేటర్ కిషోర్, జనరల్ కెప్టెన్ బాబురావు, ఎంపైర్లుగా నితీష్, సంతోష్, రాజు, కౌశిక్, స్కోరర్ గా నూనె శ్రీను, క్రీడాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):**
మండల కేంద్రంలో మంగళవారం మండల రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రేషన్ డీలర్ల ఉపాధ్యక్షుడు, యాదాద్రి భువనగిరి జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎలుగుల రాజన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాజన్న హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు లక్ష్మీపతి, కార్యదర్శి కొయ్యడ నరసింహ, డీలర్లు బాబు, రేగొండ రమేష్, కె.గీత, జగన్, ఆనంద్, జంగయ్య, మురళి, ముసలయ్య, దర్శన్, నాగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పేరుతో ఒక మొక్క- పర్యావరణానికి ఊపిరి

### ఎర్రగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా కార్యక్రమం

### పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్ : ఉండేటి ఆనంద్‌కుమార్

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**
'తల్లి పేరుతో ఒక మొక్క నాటండి' కార్యక్రమంలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములైతే కోట్లాది మొక్కలు నాటబడతాయని, అవి భవిష్యత్తులో పెరిగి పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా. నాజ్నిన్ తబస్సుమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృక్షాలు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి మన




ఆరోగ్యానికి ఎంతో అవసరమని, అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శంకర్ మహదేవన్, సునంద రెడ్డి, ఎకో క్లబ్ ఇన్‌చార్జి మోత్కూరి పద్మ, ఉపాధ్యాయులు శాంత, బాబురావు, వెంకటేశ్వరరావు, సుశీల, మోతిలాల్, జయరాం, కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, శిరీష, ఖాసీం, ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మధిర ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఏక్ పెడ్ మాకే నామ్

**మధిర, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**
మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మంగళవారం ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి. శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర మేరకు ఏక్ పెడ్ మా కే నామ్ 2 వ రోజు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనమా సూరి, సూరం శెట్టి కిషోర్, మిరియాల రమణ గుప్తా పాల్గొని ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భావితరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఓ తౌరియా, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పెనుబల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

## మంత్రి పొంగులేటికి వినతి పత్రం



పెనుబల్లి సెప్టెంబర్ 22 (జనంసాక్షి) రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం పెనుబల్లిలో పర్యటించిన సందర్భంగా ఆయనకు పెనుబల్లి మండలం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయ నిర్మాణమునకు 5 కుంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఇప్పించుటకొరకు, పెనుబల్లిలో గల ఆర్యవైశ్య స్మశాన వాటిక కు సీసీ రోడ్డు,చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం కొరకు వినతి పత్రంలో పేర్కొంటూ పొంగులేటి కి అందించారు. వినతి పత్రం అందించిన వారిలో పెనుబల్లి మండల ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ పసుమర్తి విశ్వనాథ్, మిట్టపల్లి కిరణ్ కుమార్, ఆచంటి శ్రీనివాసరావు, నాగుబండి ప్రభాకర్ రావు, చిట్లూరి రమేష్,కొదుమూరి శ్రీనివాసరావు, మిట్టపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛహరిత సారపాకే లక్ష్యం..

- మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలి..
- సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్..




బూర్గంపహాడ్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మడలం సారపాక గ్రామపంచాయతీని స్వచ్ఛ, హరిత గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ సంత ఏరియాలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ పీఎస్పీడీ భద్రాచలం యూనిట్ డీజీఎం చెంగల్రావు, ఉపసర్పంచ్ కన్నెదార రమేష్, ఈఓ జి. రవికుమార్ పాల్గొన్నారు. పాలకమండలి సభ్యులు ముద్దా వెంకటేశ్వరరావు, ఏసోబు, కొమరం సావిత్రి, గౌరి, లక్ష్మీప్రసన్నతో పాటు స్థానిక నాయకులు దామెర ఆదినారాయణ, చుక్కపల్లి బాలాజీ, లకావత్ చందు, నాగరాజు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రపంచ రేబిస్ అవగాహనా వారోత్సవాలు



ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) ప్రపంచ రేబిస్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నేటి నుండి ఈనెల 28వ తేదీ వరకు జరుగనున్న అవగాహన కార్యక్రమాన్ని పురస్కరించుకొని,జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ ప్రజలకు రేబిస్ వ్యాధి నివారణ, కుక్కలు మరియు ఇతర జంతువుల కాటు వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారని ప్రజలు తప్పక పాటించవలసిన జాగ్రత్తలు, కుక్క లేదా ఇతర జంతువు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు మరియు ప్రవహించే నీటితో కనీసం 15 నిమిషాలు శుభ్రంగా కడగాలి,గాయానికి పసుపు, మిరపపొడి, నూనె, మట్టి వంటి పదార్థాలు రాయకూడదు అని పేర్కొంటూ, జంతువు కరిచిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి/ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి అని పేర్కొంటూ ,వైద్యుల సూచన మేరకు రేబిస్ వ్యాక్సిన్ మరియు అవసరమైనప్పుడు రేబిస్ఇమ్యూనోగ్లోబులిన్ తీసుకోవాలి అని, పెంపుడుకుక్కలకు క్రమంతప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలని, వీధి కుక్కలను రెచ్చగొట్టకుండా, ముఖ్యంగా చిన్నపిల్లలు వాటికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి అని,"రేబిస్‌ను నివారించవచ్చు. జంతువు కరిచినప్పుడు వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు." అని తెలిపారు.

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవానికి

## కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి..

### పూలపెల్లి సుధాకర్ రెడ్డి..



బూర్గంపహాడ్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :– అశ్వాపురం మండలం మొల్లెలపాడులో ఈ నెల 23న నిర్వహించనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లా పార్టీ ప్రతినిధులు, గ్రామపంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో పాటు ఐఎన్‌టీయూసీ, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, మహిళా విభాగాలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుధాకర్ రెడ్డి కోరారు.

## విద్యతోనే సమాజ ప్రగతి

బెండాలపాడు పాఠశాలలో ప్రీ ప్రైమరీ నూతన తరగతి గది ప్రారంభం

విద్యార్థులకు ఉచిత యూనిఫాం పంపిణీ చేసిన సర్పంచ్ బొర్రా లలిత



చంద్రుగొండ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని బెండాలపాడు గ్రామ సర్పంచ్ బొర్రా లలిత అన్నారు. చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా మంజూరైన ప్రీ ప్రైమరీ కేంద్రం కోసం ఏర్పాటు చేసిన తరగతి గదిని మంగళవారం ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ప్రీ ప్రైమరీ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా సృజనాత్మక బోధనా పద్ధతులను అనుసరిస్తూ, ఇంగ్లీష్ పదాలను బొమ్మలు, రంగుల సహాయంతో పరిచయం చేసే విధంగా తరగతి గదిని తీర్చిదిద్దారు. చిన్నారులు ఆటపాటలతో పాటు ఆసక్తికరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.అనంతరం తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంజూరైన ఉచిత యూనిఫాంలను సర్పంచ్ బొర్రా లలిత విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, ఉప సర్పంచ్ బానోత్ బాలు, పంచాయతీ కార్యదర్శి రోహిత్, మాజీ ఎంపీటీసీ కారం వెంకటేశ్వర్లు, మల్లం కృష్ణయ్య పాల్గొని విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బొర్రా లలిత మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు ఆటపాటల్లోనూ చురుకుగా పాల్గొంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. సమాజంలో ఎలాంటి మార్పు అయినా విద్యతోనే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకుని భవిష్యత్తులో ప్రయోజకులుగా ఎదగాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నాగరాజు, రవికుమార్, ఇమామ్ ఖాన్, ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయురాలు అఖిల, ఆయా గోపమ్మ, పోడియం నరసింహారావు, ఉపేంద్ర, సాధికాబేగం, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటల పాటు మద్యం విక్రయాలపై నిషేధం

నిమజ్జనం సందర్భంగా పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు

ఖమ్మం కార్పొరేషన్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి) ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, క్లబ్బులు ఇతర మద్యం విక్రయించే/సర్వ్ చేసే సంస్థలు 23 వ తేదీ ఉదయం 6.00 గంటల నుంచి 24 వ తేదీ, ఉదయం 6.00 గంటల వరకు పూర్తిగా మూసివేయాలని, ఈ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయాలు లేదా సరఫరా చేయరాదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు.నేటి నుండి (బుధవారం) వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజల శాంతిభద్రతలను ,ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తెలంగాణ ఎక్సైజ్ చట్టం ?1968లోని సెక్షన్ 20 ను వినియోగిస్తూ, ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




కల్లూరు లో ట్రాఫిక్ నియంత్రణపై

## అధికారులు చర్యలు చేపట్టాలి

కల్లూరు నుంచి పుల్లయ్య బంజర్ వెళ్లే రహదారిని డబుల్ లైన్ రోడ్డుగా విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

కల్లూరు సెప్టెంబర్ 22 (జనంసాక్షి).. కల్లూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రజాప్రతినిధులు, ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.కల్లూరు పట్టణ పరిధిలోని పుల్లయ్య బంజర్ రోడ్డులో అనునిత్యం ట్రాఫిక్ స్తంభించి, బాటసారులు, ద్విచక్ర ,భారీ వాహనాలు, ఆటోలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు ట్రాఫిక్ లో చిక్కుకున్న ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్లూరు నుంచి పుల్లయ్య బంజర వెళ్లే ఆర్ అండ్ బి రహదారి ప్రాంతంలో ప్రభుత్వ ప్రైవేటు రంగ,బ్యాంకులు, హాస్పిటల్స్, రైస్ మిల్లులు, పలు దేవాలయాలు ఉన్నాయి. ఈ రహదారిపై నిత్యం వేలాదిమంది ప్రజలు, భారీ సంఖ్యలో టూవీలర్లు, లారీలు, స్కూల్ బస్సులు, ఆటోలు రాకపోకలు కొనసాగించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ప్రధానంగా గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో అత్యవసర సేవల వాహనాలు, పాఠశాల విద్యార్థులు, సాధారణ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి ప్రజల సౌకర్యార్థం కల్లూరు లోనిఅంబేద్కర్ విగ్రహం కూడలి నుంచి పుల్లయ్య బంజర గ్రామం వరకు ఆర్ అండ్ బి రహదారిని డబుల్ లైన్ రహదారిగా ఆధునికరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

## సహజ వ్యవసాయంపై రైతులకు అవగాహన



మధిర, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): మధిర మండలం మల్లవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు సహజ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్ మాట్లాడుతూ సహజ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకునే అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహజ వ్యవసాయం అనేది కేవలం రసాయనాల వినియోగాన్ని తగ్గించడం మాత్రమే కాకుండా, నేల ఆరోగ్యం, పంట అవశేషాల వినియోగం, నీటి సంరక్షణ, జీవ వైవిధ్యం, జీవ ఆధారిత ఇన్‌పుట్ల వినియోగం వంటి అంశాలను సమగ్రంగా పరిగణించే వ్యవసాయ విధానమని వివరించారు. రైతులు ముందుగా చిన్న విస్తీర్ణంలో సహజ వ్యవసాయ పద్ధతులను ప్రదర్శనా క్షేత్రాలుగా చేపట్టి, సాగు ఖర్చు, దిగుబడి మరియు నికర ఆదాయాన్ని నమోదు చేసుకుని ఫలితాల ఆధారంగా తదుపరి విస్తరించాలని అధికారులు సూచించారు.రైతులు బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, మల్చింగ్ చేసుకొని పంట వైవిధ్యం, జీవ ఆధారిత పురుగు నియంత్రణ మరియు సమర్థవంతమైన నీటి నిర్వహణ వంటి పద్ధతులను తమ పంటలకు అనుగుణంగా అవలంబించాలని సూచించారు.వరి, పత్తి, మిరప మరియు పప్పుధాన్యాలలో పురుగు, తెగుళ్లను ముందుగానే గుర్తించి, అవసరాన్ని బట్టి మాత్రమే నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పురుగు కనిపించిన వెంటనే మందులు పిచికారీ చేయకుండా, ముందుగా పురుగును గుర్తించి, దాని ఉధృతిని పరిశీలించి, ఉపయోగకరమైన కీటకాల ఉనికిని గమనించి, అవసరమైనప్పుడు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు.అలాగే పంట అవశేషాలను కాల్చకుండా సరైన విధంగా వినియోగించడం, నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం, భూసార పరీక్షల ఆధారంగా పోషక యాజమాన్యం చేపట్టడం వంటి అంశాలను వివరించారు.ఈ సందర్భంగా మల్లవరం వ్యవసాయ విస్తరణ అధికారి గోపి రైతులకు పంటల వారీగా సహజ వ్యవసాయ పద్ధతులపై వివరించారు. సహజ వ్యవసాయంలో జీవ ఆధారిత ఇన్‌పుట్ల వినియోగం, రైతులకు అందుబాటులో ఉన్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మల్లవరం క్లస్టరికి చెందిన రైతులు పాల్గొన్నారు.

# ముంపు బాధితులకు న్యాయం చేయాలి..

## ఉద్యమకారుల హామీలు వెంటనే అమలు చేయాలి: గోపగాని శంకరరావు..

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు కీలక పాత్ర పోషించారని, రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఈ ప్రాంతానికి అన్యాయం జరిగిందని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర ముఖ్య సలహాదారు గోపగాని శంకరరావు అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం వేదిక సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లమోతు సురేష్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపగాని శంకరరావు మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాలు రాష్ట్ర విభజన సమయంలో ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో కలవడంతో ఈ ప్రాంతం తీవ్రంగా నష్టపోయిందన్నారు. పోలవరం ముంపుతో ప్రజల అవస్థలు పోలవరం ప్రాజెక్టు రివర్స్ వాటర్ ప్రభావంతో చర్ల, వెంకటాపురం, దుమ్ముగూడెం, అశ్వాపురం, బూర్గంపహాడ్, భద్రాచలం తదితర ప్రాంతాల్లో ముంపు సమస్య తీవ్రంగా ఉందన్నారు. పంటలు దెబ్బతింటూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముంపు బాధితులకు మెరక ప్రాంతాల్లో పక్కా ఇళ్లు



నిర్మించి పునరావాసం కల్పిస్తామన్న హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించి పోలవరం ఎత్తు తగ్గించే చర్యలు చేపట్టాలని, ముంపు ప్రాంతాల్లోని గిరిజనులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించాలని, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పక్కా పునరావాస గృహాలు నిర్మించాలని కోరారు. ఉద్యమకారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి. 2014 జూన్ 2 వరకు ఈ ప్రాంతంలో ఉండి రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఉద్యమకారులను కూడా తెలంగాణ ఉద్యమకారులతో సమానంగా గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో కేసులు ఎదుర్కొని విలువైన సమయం కోల్పోయిన యువతకు ఉద్యోగ నియామకాల్లో వయోపరిమితి సడలింపుతో పాటు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రంలో వివరించారని తెలిపారు. కే.కే. కమిటీ కాలయాపన చేయకుండా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఇటీవల మృతి చెందిన తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు, విద్యావేత్త మహమ్మద్ నహీం సాబ్కు సమావేశంలో నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి, ఉద్యమకారులకు ఇది తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బట్టు రాజేందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి పోడియం నరేందర్, జిల్లా కన్వీనర్ మూల నాగిరెడ్డి, పినపాక నియోజకవర్గ కన్వీనర్ కొక్కొండ ప్రసాద్తో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ఎర్రబోయినపల్లి లో కుక్కల బెడద నివారణకు గ్రామ పంచాయతీ చర్యలు

**కల్లూరు సెప్టెంబర్ 22(జనంసాక్షి)** కల్లూరు మండల పరిధిలోనిఎర్రబోయినపల్లి గ్రామంలో ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కుక్కల భారీ నుంచి ప్రజలను రక్షించేందుకు గ్రామపంచాయతీ సర్పంచ్ పొట్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది వీధికుక్కల బెడద నియంత్రణకు మంగళవారంశ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని ప్రధాన వీధులు, ప్రజలు నివసించే పలు ప్రాంతాలలో, సంచరిస్తున్న వీధి కుక్కలను గుర్తించి ప్రత్యేకంగా చాకచక్యంగా కుక్కలను పట్టుకునే ముఠా ను ఏర్పాటు చేసి కుక్కలను పట్టుకొని ఆటోలలో తరలిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. వీధులలో రహదారులపై కుక్కలు గుంపులు గుంపులుగా



సంచరిస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. కుక్కల బెడతతో బెంబేలెత్తిపోతున్న గ్రామ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు స్పందిస్తూ కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పరిశుభ్రత, ప్రజారోగ్యం, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. "ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం. గ్రామంలో కుక్కల బెడదను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం" అని గ్రామ సర్పంచ్ పోటు శ్రీనివాసరావు పంచాయతీ సిబ్బంది తెలిపారు.

# సెప్టెంబర్ 24న జాబ్ మేళా నిర్వహణ

## జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

**ఖమ్మం కార్పోరేషన్, సెప్టెంబర్ 22( జనంసాక్షి)** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం హైదరాబాద్ అపోలో ఫార్మసీ, ఖమ్మం లోని వరుణ్ మోటార్స్, భారత్ హ్యుందాయి లలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 24న గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టిటిడిసి నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ లో పని చేసే విధంగా అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, ట్రైనీ ఫార్మాసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్ట్ అడ్వైజర్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ గా పని చేయుటకు 18-35 సంవత్సరాల వయస్సు గలవారు, సంబంధిత ఉద్యోగానికి డి ఫార్మసీ / బి ఫార్మసీ / ఎం ఫార్మసీ (పిసిఐ) / ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ అర్హత గల యువతీ, యువకులు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 12 వేల 500 నుండి 25 వేల వరకు ఉంటుందని అన్నారు. ఖమ్మంలో పని చేసే విధంగా వరుణ్ మోటార్స్ లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ / టెక్నీషియన్/సెక్యూరిటీ/ అడ్వైజర్ ఉద్యోగాలకు 22 నుండి 40 వయస్సు గల వారు అర్హులనీ, ఎంపికైన వారికి వేతనం 15 వేల నుండి 30 వేల వరకు ఉంటుందని, ఖమ్మం భారత్ హ్యుందాయి లో ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్స్/ టెక్నీషియన్/ టెలి కాలర్ ఉద్యోగాలకు 23 నుండి 30 సంవత్సరాల వారు అర్హులనీ, ఎంపికైన వారికి వేతనం 10 వేల నుండి 18 వరకు ఉంటుందని తెలిపారు. మొత్తం దాదాపు 127 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాకు హాజరు కావాలని, ఇతర వివరాలకు హెచ్ ఆర్ నంబర్ 928411-07531, 70369-02902, 72079-17714 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పదోన్నతి పొందిన వల్లంకొండ ఉపేంద్రకు ఘన సన్మానం

**ఖమ్మం, (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న వల్లంకొండ ఉపేంద్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మహబూబాబాద్‌కు పదోన్నతి పొందిన సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల ఆధ్వర్యంలో



ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లంకొండ ఉపేంద్రను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఉద్యోగులు అభినందనలు తెలిపారు. పదోన్నతి పొందిన ఆమెకు కొత్త బాధ్యతల్లో విజయవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టీవీకే శ్రీనివాసరావు, సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ వెక్కిరాల శ్రీనివాస్, మహమ్మద్ రహీముద్దీన్, బీసీ వెల్ఫేర్ సూపరింటెండెంట్ ఎం. చంద్రశేఖర్, మహమ్మద్ అస్లం ఖాన్, వేముల శంకర్, కె. పవన్ కుమార్, బి. రజిత, పోకల రాకేష్, ఎం.డి. ఫాతిమా పర్వీం, ఎం. విజయలక్ష్మి, టి. వెంకటేశ్వర్లు, ఆర్. రమాదేవి, సిహెచ్. ప్రశాంత్, పి. కవిత తదితరులు పాల్గొన్నారు. ట్రైబల్ వెల్ఫేర్, ఆర్సీఓ, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు చెందిన ఉద్యోగులు జె. నరసింహారావు, జి. రాజేశ్వరరావు, పి. శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాసరావు, శ్రీకాంత్, కొండలు, ఉత్తర కుమార్, యాకుబ్ పాషా, కళ్యాణ్ చక్రవర్తి, నవీన్ కుమార్, హరీష్, ఉమా, శ్రీనివాస్, బుర్రి వినోద్ కుమార్, మణి, తలారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని ఉమవల్లంకొండ ఉపేంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థి విప్లవ పతాక ఏఐఎస్ఎఫ్

○స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవాగ్నిని రగిలించిన నిప్పుకణం

○ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు గోడపత్రిక ఆవిష్కరణ

**ఖమ్మం, (జనంసాక్షి) :** స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవాగ్నిని రగిలించిన నిప్పుకణంగా, ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జరిగిన తొలి దశ, మలి దశ ఉద్యమాల్లో వీరోచిత పోరాటం చేసిన విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్‌కు ఘనమైన చరిత్ర ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడుపల్లి లక్ష్మణ్, బూర మనోజ్ అన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో హనుమకొండలో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంగళవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో అలుపెరగని సమరశీల ఉద్యమాలకు ఏఐఎస్ఎఫ్ వేదికగా నిలిచిందన్నారు. దేశానికి ఎందరో త్యాగధనులను అందించిన తొలి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వంతో పాటు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'స్వాతంత్ర్యం మా జన్మహక్కు' అనే నినాదంతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. మెకాలే విద్యా విధానానికి వ్యతిరేకంగా, విద్యారంగంలో సంస్కరణల కోసం పోరాటాలు నిర్వహించడంతో పాటు కొఠారి కమిషన్ సిఫారసుల అమలు కోసం ఉద్యమించిన ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. 'చదువుతూ పోరాడు.. చదువు కోసం పోరాడు' అనే నినాదంతో విద్యారంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. విశ్వవిద్యాలయాల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కు ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల పెంపు కోసం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. మహిళలపై జరుగుతున్న




దాడులకు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా కూడా ఉద్యమాలు చేపట్టిందని తెలిపారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో పాటు తెలంగాణ పోరాట వారసత్వాన్ని పునికిపుచ్చుకుని విద్యార్థులు హక్కుల కోసం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో అటల్ బిహారీ వాజ్‌పేయి, జవహర్‌లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా వంటి ప్రముఖులు ఏఐఎస్ఎఫ్‌తో అనుబంధం కలిగి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ నాగులమీరా, జిల్లా ఉపాధ్యక్షులు శివ నాయక్, మనోహర్, గోపి, శివ, పవన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# జూలూరులో పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):**
మండలంలోని జూలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా సహకార అధికారి నాగార్జున, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సురేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా కళ్లెం రాఘవరెడ్డి, వైస్ చైర్మన్‌గా మేకల రమేష్‌గౌడ్‌తో పాటు డైరెక్టర్లుగా కొత్తపల్లి శ్రీశైలం, బొచ్చు యాదమ్మ, సందేని కిషన్, జంగయ్య, పక్కీర్ మల్లారెడ్డి, అందేలా విజయ, జడల అంజయ్య, పల్ల విష్ణువర్ధన్‌రెడ్డి, బొబ్బల సుభాష్‌రెడ్డి, దుర్గం శ్రీశైలం, రామావత్ కిషన్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని పలువురు అభినందించారు. రైతుల సంక్షేమం, పీఏసీఎస్ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు.

# వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**సూర్యాపేట(జనంసాక్షి):**
వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని శ్రీవేదాంత భజన మందిర దేవాలయ అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ శ్రీవేదాంత భజన మందిరంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ధరూరి సింగరాచార్యులు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి నకిరేకంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, ఓరుగంటి చంద్రశేఖర్, సుమన్, వాస కృష్ణ, షీలా శంకర్,ధరూరి రాఘవాచార్యులు, గోమటం రాఘవాచార్యులు,హేమలత, హైమలత, శోభారాణి, గోదాదేవి, మౌనిక, లతాంజలి, రేణుక, నరసింహారావు, జ్యోతి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు

**జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన, జానపద గేయాలు, నృత్యాలు, దేశభక్తి గేయాలు, చిత్రలేఖనం తదితర అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎంఈఓ బాలు నాయక్, కో కన్వీనర్లు ఎబెల్ శశి, జె. నాగయ్య, సైదమ్మ, కిషోర్ పాల్గొన్నారు.





# బాపూజీ ఆశయాలకు చిరునామాగా పల్లెర్లలో విగ్రహం

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి సెప్టెంబర్ (22)**
పల్లెర్ల గ్రామంలో మిశ్రమ చేనేత సహకార సంఘ భవన ఆవరణలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. చేనేత సహకార సంఘం పాలకవర్గ సభ్యులు నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పొడుగు వెంకటేశం మాట్లాడుతూ.. చేనేత సంఘ సభ్యుల సహకారంతో పద్మశాలి జాతిపిత, మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని ఆయనను నిత్యం స్మరించుకోవడం తమ అదృష్టమన్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు ఏలూరి సుదర్శన్, కోశాధికారి సాయిని పురుషోత్తం, డైరెక్టర్లు గుర్రం మల్లేష్, వట్నాల వెంకటేష్, ఏలూరి ధనలక్ష్మి వెంకటేశ్వర్లు, రాపోలు శ్వేత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

## కోలాట బృందాలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి: చెక్క వెంకటేష్

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి సెప్టెంబర్ (22)**



గ్రామీణ ప్రాంత కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ప్రజానాట్య మండలి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండలం రాఘవాపురం గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ కోలాట బృందం కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు దాటినా గ్రామీణ కళాకారులు, కవులు, వివిధ రంగాలకు చెందిన కళాకారులకు తగిన ప్రోత్సాహం అందడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా గ్రామీణ కళాకారులను ఆదుకుని, యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కళాకారులకు ప్రదర్శనలు ఇచ్చే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే కళాకారులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అండగా నిలవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కోలాట కళాకారులు కొంపల్లి పుష్ప, బాకీ నరసమ్మ, మచ్చ కృష్ణవేణి, కూరెళ్ల సబిత, మచ్చ పద్మ, కూరెళ్ల వినోద, మచ్చ సరిత, కూరెళ్ల మల్లమ్మ, మచ్చ సునీత, మచ్చ విజయ, తుమ్మలగూడెం అండాలు, తుమ్మలగూడెం సంధ్య, కూరెళ్ల సావిత్రి, తుమ్మలగూడెం మమత, మచ్చ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా పాక మల్లేష్ యాదవ్

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
మండలంలోని పోచంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సహకార అధికారి నాగార్జున, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సురేష్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పీఏసీఎస్ చైర్మన్‌గా పాక మల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్‌గా కొట్టం కరుణాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా సామల రాజిరెడ్డి, గుండ్ల వేణు, రావుల అనిల్, వరాల రామచంద్రరెడ్డి, చెక్క వెంకటేశం, దేశాట్ల మల్లేష్, ఆర్ల ఐలయ్య, యట కైలాసం, పవిరాల లింగమ్మ, రామవత్ చంద్రు, శ్రీపల్లి రాములమ్మ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పాక మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రైతులకు అవసరమైన సేవలను మరింత మెరుగ్గా అందిస్తూ సహకార సంఘాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.



# రోడ్డు నిర్మాణంలో ఇసుకకు మసిబూసి మారేడుకాయ!

**నాణ్యతకు గండి - త్వరలోనే రోడ్డు ధ్వంసం?**



ఇసుక బదులు కంకర పొడిని వాడటం వల్ల సిమెంట్ బాండింగ్ సరిగ్గా జరగక, నిర్మిస్తున్న రోడ్డు కొద్దిరోజులకే పగుళ్లు బారిపడి పాడైపోయే ప్రమాదం ఉందని సాంకేతిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి వేస్తున్న రోడ్డు ఎక్కువ కాలం మన్నికగా ఉండే పరిస్థితి లేకపోవడంతో, గ్రామాభివృద్ధి పేరుతో నాసిరకం పనులు మసిబూసి మారేడుకాయ చేస్తున్నారని పూసలపాడు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల బాధ్యతారాహిత్యం**

ఈ విషయమై పంచాయతీరాజ్ అధికారులను వివరణ కోరగా, తాము రాంబో సాండ్ వాడకానికి అనుమతి ఇచ్చామని చెప్పి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు అయితే క్షేత్రస్థాయిలో రాంబో సాండ్ పేరుతో కేవలం క్రషర్ల నుంచి వచ్చే వ్యర్థ దుమ్ము/పొడిని మాత్రమే వాడి రోడ్డు పూడ్చేస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నాణ్యతా ప్రమాణాలను (క్వాలిటీ కంట్రోల్ ) క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పూసలపాడు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# భగవద్గీత సర్వ మానవాళికి జీవిత మార్గదర్శిని

**సూర్యాపేట (జనంసాక్షి):** శ్రీకృష్ణుడు ప్రబోధించిన భగవద్గీత సర్వ మానవాళికి జీవిత మార్గదర్శిని అని సద్గురు శ్రీనిత్య శుద్ధానంద స్వామి క్షేత్రం శ్రీరామదూతాశ్రమం ఆమనగల్లు సంస్థాపకులు శ్రీశివానంద స్వామి అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ గల రామాలయంలో 12వ శుద్ధ ఏకాదశి గీత పారాయణంలో పాల్గొని ప్రసంగించారు. కురుక్షేత్ర రణ రంగంలో అర్జునుడు విషాదంలో మునిగి పోయినప్పుడు, శ్రీకృష్ణ పం~మాత్ముడు అందించిన ఈ బోధనలు నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరి ఒత్తిడిని, అజ్ఞానాన్ని తొలగించడానికి ఉపయోగపడుతున్నాయని అన్నారు.మనం చేసే ప్రతి పనిలో ఫలితంపై ఆశపెట్టుకోకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు.జీవితంలో సుఖాలు, కష్టాలు, గెలుపోటములు ఏవైనా ఎదురైనప్పుడు మనిషి ఒకేలా ఉండాలని అన్నారు.మనలో దాగి ఉన్న అనంతమైన శక్తిని పుణ్య కార్యాలకే ఉపయోగించాలని అన్నారు.గోరంట్ల శ్రీనివాస్ శారద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామాలయం అధ్యక్షులు గుండా శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఉప్పల సత్యనారాయణ, కోశాధికారి మానం స్వర్ణ సింగ్,నాగవెల్లి ప్రభాకర్, నాగవల్లి దశరథ, గోరంట్ల మోహన్, గుమ్మడవెల్లి రామనరసయ్య, శ్రీరంగం రాము, కలకోట లక్ష్మయ్య, వెంపటి శబరినాథ్, తీరిటపల్లి సతీష్, గాలి అరవింద్, చల్లా గోపి, ప్రేమలత, అనిత, పద్మ, సువర్ణలక్ష్మి, చంద్రావతి, గాయత్రి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట (జనంసాక్షి) :**
జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట మండల యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదగాని నాగేశ్వరరావు, శనగల యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ కంటి హాస్పిటల్, సూర్యాపేట వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.పెన్షనర్లు,ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారు, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు,జర్నలిస్టులు,అర్హులైన రేషన్ కార్డు కలిగిన వారు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రైతులకు సమీకృత వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం

**చింతపాలెం(జనంసాక్షి)**
ఆంధ్ర లయోలా కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, కేవీకే గడ్డిపల్లి నుంచి వచ్చి ఇక్కడ నిర్వహిస్తున్న గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా దొండపాడు గ్రామం లో రైతులకు సమీకృత వ్యవసాయ విధానంపై ప్రత్యేక అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థిని జాహ్నవి మరియు ఆమె బృందం దొండపాడు గ్రామ రైతులకు సమీకృత వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరంగా తెలియజేశారు. ఈ విధానం ద్వారా రైతులకు ఒకేసారి మూడు ముఖ్యమైన లాభాలు చేకూరు తాయని వివరించారు స్థిరమైన ఆదాయం పంటలతో పాటు పశుపోషణ,కోళ్ళ పెంపకం లేదా చేపల పెంపకం వంటివి చేపట్టడం వల్ల ఏడాది పొడవునా రైతుకు ఏదో ఒక రూపంలో ఆదాయం లభిస్తుంది. పెట్టుబడి ఖర్చులు తగ్గడం ఒక దానికి సంబంధించిన వ్యర్థాలు మరొక దానికి ఆహారంగా లేదా ఎరువుగా ఉపయోగ పడతాయి. ఉదాహరణకు పశు వుల పేడ పంటలకు ఎరువుగా మారడం వల్ల రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. భూసార రక్షణ మరియు సుస్థిరత కేవలం ఒకే పంటపై ఆధారపడకుండా ఉండటం వల్ల మార్కెట్ ఒడిదొడుకులు లేదా ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే నష్ట భయం తగ్గుతుంది. అలాగే భూమి యొక్క ఉత్పాదకత పెరుగుతుందని కె.జాహ్నవి మరియు బృందం వివరించిన తీరును,వాళ్ళ అందించిన సమాచారాన్ని గ్రామ రైతులు



ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆధునిక,లాభసాటి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించిన ఆంధ్ర లయోలా కళాశాల విద్యార్థులను గ్రామ పెద్దలు, రైతులు ప్రత్యేకంగా అభినందించారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**సూర్యాపేట (జనంసాక్షి):**


వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది కమిషనర్ సిహెచ్. హన్మంత రెడ్డి లు తెలిపారు. నేడు నిర్వహించనున్న నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నిమజ్జనం కోసం చెరువు కట్టపై మూడు భారీ క్రేన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల భద్రత కోసం చెరువు కట్టపై లైటింగ్, భారీ కేడింగ్‌తో



పాటు అనౌన్స్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిమజ్జన వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా ప్రధాన రహదారులపై ఉన్న గుంతల్లో గ్రావెల్, డస్ట్ పోసి రహదారులను సరిచేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రధాన కూడళ్లలో తాగునీటి ఏర్పాట్లు చేస్తున్నామని, నిమజ్జన వాహనాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను ఇప్పటికే తొలగించినట్లు చెప్పారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు పూజా సామగ్రిని చెరువులో వేయకుండా, చెరువు కట్టపై మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన సిబ్బందికి అందజేయాలని సూచించారు. పూజా సామగ్రిని చెరువులో వేయవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. నిమజ్జన కార్యక్రమం నిర్వహణ కోసం మున్సిపాలిటీ నుంచి మొత్తం 332 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ప్రజలు మున్సిపాలిటీకి సహకరిస్తూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమ ఏర్పాట్లను మున్సిపల్ ఈఈ ఎం.కిరణ్, డీఈ ప్రణయ్‌రెడ్డి, ఏఈ తిరుమలయ్య, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, జూనియర్ అసిస్టెంట్లు ఎండి.గౌసుద్దిన్, ఎస్ఎస్ఆర్.ప్రసాద్, సయ్యద్ సమ్మి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.



## గుర్రంపోడులో మేడి వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**గుర్రంపోడు, సెప్టెంబర్ 22: (జనంసాక్షి)**
నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని వద్ద కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మేడి వెంకన్న ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్నదాన (అన్నప్రసాద వితరణ) కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు, మండల ప్రజలకు మేడి వెంకన్న స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మేడి వెంకన్న మాట్లాడుతూ.. స్వామివారి కృపతో మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, ఆలయ చైర్మన్ జాల పెద్ద సత్తయ్య, గాలి కొండలు, శ్రీను, వెలుగు యాదయ్య, తగుళ్ల యాదయ్య, రావుల కొండలు, చేగొండి మల్లేష్, జాల నరసింహ, పోలేపల్లి భద్రయ్య, కమిటీ సభ్యులు, మరియు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బొంతల దివ్య లక్ష్మి

**హాలియా జనం సాక్షి సెప్టెంబర్ 22:**
అనుముల మండలం కొత్తపల్లి ఎస్జీటీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు బొంతల దివ్యలక్ష్మి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసినందుకు బొంతల దివ్యలక్ష్మిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. విద్యార్థులలో విద్యా ప్రమాణాలను పెంపొందించడం, పాఠశాల అభివృద్ధికి సహకరించడం, బోధనలో వినూత్న పద్ధతులను అవలంబించడం వంటి సేవలను గుర్తించి ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు కేతావత్ శంకర్ నాయక్, శ్రీపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డీఈవో శశిధర్‌రావు, మాజీ ఎంపీపీ అనుముల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్‌రావుపై విమర్శలు చేస్తే సహించం!

### అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి: బీఆర్ఎస్ నేతల సవాల్

### మండల అధ్యక్షుడు బొట్ల యాదయ్య ఆధ్వర్యంలో పత్రిక సమావేశం

**మోటకొండూరు, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):**
మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డిలపై కాంగ్రెస్ నేతలు అనవసర విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కర్రె వెంకటయ్య హెచ్చరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోట్ల యాదయ్య ఆధ్వర్యంలో మంగళవారం మోటకొండూర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్రె వెంకటయ్య పాల్గొని మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలేరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై జీవోలతో సహా సైదాపురంలో బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. ఇటీవల హరీశ్‌రావు సమావేశానికి వచ్చిన అనూహ్య స్పందన, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలను చూసి అధికార పార్టీ నాయకులు ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. మోటకొండూర్ మండల ఏర్పాటు, ఎంఆర్ఓ, ఎండీఓ కార్యాలయాలతో పాటు వివిధ ప్రభుత్వ భవనాల మంజూరులో సునీతా మహేందర్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. నియోజకవర్గంలో 24 గంటల విద్యుత్, వైద్య సదుపాయాలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుత అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు స్వార్థ ప్రయోజనాల కోసం భూకబ్జాలు, మట్టి, ఇసుక దందాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ అక్రమాలకు సంబంధించిన ఆధారాలను పరిశీలించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అక్రమాలకు పాల్పడితే రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఖైరోజు వెంకటాచారి, మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ బీరయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనంతుల జంగారెడ్డి, నాయకులు పన్నాల అంజిరెడ్డి, ఎగిడి కృష్ణ, బురాన్, ఎర్ర మల్లేష్, భూమండ్ల యాదయ్య, బాల్ల లింగం, బుగ్గ నాగరాజు, బోట్ల మహేష్, ఏకు చంద్రారెడ్డి, గాజుల దామోదర్, మల్గా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# మూసీ నీటిని వెంటనే విడుదల చేయాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట మండల పరిధిలోని తాళ్లకాంపాడు, పెన్ పహాడ్ మండల పరిధిలోని సింగిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు మూసి ప్రాజెక్టు పరిధిలో తూముల కింద సుమారు 300 ఎకరాల వరి పొలాలను సాగు చేశామని కానీ మూసీనీరు రాక పొలాలు ఎండిపోతున్నాయని మంగళవారం కలెక్టరేట్ ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ హరిసింగ్ కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక ఎల్ నినో ప్రభావంతో కుంటల్లో, చెరువుల్లో నీళ్లు లేక తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. మూసీ నీటిని కొన్ని రోజులు ఇచ్చి అర్ధాంతరంగా నిలిపివేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వేల



రూపాయల పెట్టుబడులు పెట్టి వరి పొలాలను సాగు వేశామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి మూసీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎలక సైదులు, కాసర్ల లింగారెడ్డి, బి.సీతారాములు, యానాల సత్యం, పేర్ల లింగయ్య, జి.ఎలమంచయ్య, కె.నరసయ్య, జి.గణేష్, జి.శివ, ఎం.మహేష్, సతీష్,కొమ్మ సైదులు, పేర్ల చిన్న వెంకన్న, గుండాల రాంబాబు, గుండాల లింగయ్య, కొమ్మ లింగయ్య, పేర్ల మల్లయ్య, లింగయ్య, గోపయ్య, నామ రవి, సైదులు తదితరులు పాల్గొన్నారు.




## స్పేస్ ఆన్ వీల్స్" అంతరిక్షంపై

# విద్యార్థులకు అవగాహన

**చిలుకూరు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**

మండల కేంద్రములోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం శక్తి యూత్ ఆధ్వర్యంలో స్పేస్ ఆన్ వీల్స్ ప్రదర్శనను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొపెసర్ డాక్టర్ వి బాలకిష్టారెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధన (రాజూజీఇవ ఖీవబవజీతీఇష్త్ర) రంగంలో యువత ముందుకు రావడం దేశ భవిష్యత్తుకు మరియు సాంకేతిక ప్రగతికి ఎంతో కీలకం అని, నేటి యువతలో ఉన్న సృజనాత్మకత, నూతన ఆలోచనలు అంతరిక్ష రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు దారితీస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించేందుకే స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దేశంలో అత్యధికంగా యువతి,యువకులే ఉన్నారని దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ఉన్నత విద్యామండలి ప్రవేశపెడుతున్న నూతన కోర్సులు దేశవిదేశాలతో పోలిస్తే అందుకు దీటుగా ఉన్నాయని రానున్న విద్యాసంవత్సరం నుండి స్పేస్ టెక్నాలజీ లాంటి ప్రవేశ కోర్సులు అందుబాటులో వస్తాయని తెలిపారు. భారతదేశ భవిష్యత్ మొత్తం స్పేస్ టెక్నిలజీ అని ప్రస్తుతం న్యూ అండ్ ఎమర్జింగ్ టెక్నిలజీ అందుబాటులో ఉన్నదని స్పేస్ చట్టం కోసం కృషి చేస్తున్నట్లుగా తెలిపారు. ఎన్ ఆర్ ఎస్ సి డిపార్ట్మెంట్ ముఖ్య సలహాదారు శ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభ్యున్నతకు ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడంపై శక్తి యూత్ సభ్యులను అబినందించారు. అనంతరం ఇస్రో అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు వారు సమాధానాలు చెప్పారు. అనంతరం స్పేస్ ఆన్ వీల్స్ బస్సులో , రాకెట్లు, ఇస్రో ప్రదర్శనలు, గ్రహాలు, చంద్రయాన్ వంటి నమునాలను ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్ కొల్లు పుల్లమ్మ, చిలుకూరు సోసైటీ చైర్మన్ అలసకాని జనార్ధన్, శక్తి యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు, ఎంఈవో ఎన్ శివకుమారి, స్కూల్ కమిటీ చైర్మన్ రంజాన్ బి,శక్తి యూత్ సభ్యులు టి రాము, తలారి పుల్లారావు, రాజు, పట్టా నాగరాజు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.





## నార్కట్‌పల్లి-అద్దంకి హైవేపై హైటెన్షన్ వైర్ల పరిశీలన

## పోలీసుల, విద్యుత్ అధికారులు తనిఖీలు

**మాడుగుల పల్లి సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**

నార్కట్‌పల్లి?అద్దంకి హైవేపై మండల పరిధి కుక్కడం వద్ద బుధవారం నల్గొండ నుంచి భారీ వినాయక విగ్రహాలు తరలించనున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు తనిఖీలు నిర్వహించారు. విగ్రహాల తరలింపు సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు రహదారి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు నల్గొండ సీఐ యాదగిరిరెడ్డి, మాడుగులపల్లి ఎస్సై సురేష్ యాదవ్, తిప్పర్తి ఎస్సై రవి ఆధ్వర్యంలో ప్రాంతంలో హైవేను పరిశీలించారు ముఖ్యంగా భారీ విగ్రహాల ఎత్తుకు అనుగుణంగా రహదారిపై ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్లను పరిశీలించి, తరలింపు సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలపై దృష్టి సారించారు విగ్రహాల ఎత్తు, హైవే పరిస్థితులు, విద్యుత్ వైర్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులను అధికారులు ముందుగానే గుర్తించారు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు ఈ ముందస్తు తనిఖీల్లో ట్రాన్స్కో డిపార్ట్‌మెంట్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు భారీ వినాయక విగ్రహాల తరలింపు సురక్షితంగా, సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

## డీజేలకు అనుమతి లేదు..

### వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరపాలి

### చండూరు ఎస్సై శివకుమార్



**చండూరు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**

వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలంతా శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చండూరు ఎస్సై శివకుమార్ పిలుపు నిచ్చారు. నిమజ్జన ఉత్సవాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. “మన సంస్కృతి... మన బాధ్యత... శాంతిలోనే నిజమైన భక్తి” అనే స్ఫూర్తితో నిమజ్జన క్రతువును పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపుల్లో ఎలాంటి డీజేలు, అధిక శబ్దాలు చేసే లౌడ్ స్పీకర్లను అనుమతించేది లేదు. ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, రోగులకు అసౌకర్యం కలగకుండా ధ్వని పరిమితులు పాటించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, గుంపులుగా చేరి ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం వంటివి చేయరాదు. ప్రజల రక్షణే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యమని, నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. భక్తులంతా చట్టాన్ని గౌరవిస్తూ నిమజ్జన ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

# డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ తోటలను సాగు చేసుకోవాలి

**జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**

ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న అయిల్ పామ్ తోటలను రైతులు సాగు చేసుకుని ఆర్థికనీగా అభివృద్ధి చెందాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి తీగల నాగయ్య అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అర్వపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటనాటిన నాలుగవ సంవత్సరం నుంచి మంచి దిగుబడి ప్రారంభమవుతుంది అని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులకి, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందన్నారు. ఎరువులు మరియు అంతర పంటల యాజమాన్యానికి ఒక ఎకరానికి రూ.4,200/- చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు ప్రోత్సాహం ఇస్తుందని, గరిష్టంగా ఒక రైతుకు 12 ఎకరాల వరకు డ్రిప్పు రాయితీ



కూడా లభిస్తుందని, నమ్మకమైన నీటి వసతి గల రైతులు లాభదాయకమైన ఆయిల్ పామ్ పంటను సాగు చేసి, అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఒక ఎకరానికి దిగుబడి పది టన్నుల వరకు వస్తుందనీ మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటలుగా ప్రస్తుతం మార్కెట్లో బాగా డిమాండ్ ఉన్న కూరగాయలను, వాణిజ్య పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.. ఆయిల్ పామ్ తోటలు సాగు చేయాలనుకున్న ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారిని వంగూరీ ప్రమిత , ఉద్యాన విస్తరణ అధికారులు రంగు ముత్యంరాజు, కట్టంగూరి? రాము, వంగూరి అనిల్ రైతులు ఉన్నారు.

# చింతపల్లి పౌల్ట్రీ ఫామ్ నిర్మాణం నిలిపివేయాలి

## అఖిలపక్ష నాయకుల డిమాండ్

### ప్రజా ఆరోగ్యానికే మా మొదటి ప్రాధాన్యం: కర్ణాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి

### నిర్మాణం ఆగకపోతే రిలే నిరాహార దీక్షలు, ప్రజా ఉద్యమం చేపడతాం: కూనిరెడ్డి నాగిరెడ్డి హెచ్చరిక



**పెద్దవూర సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**

మండల పరిధిలోని చింతపల్లి గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ‘స్నేహ పౌల్ట్రీ ఫామ్’ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్, సీపీఎం, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు పౌల్ట్రీ ఫామ్ నిర్మాణానికి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించారు.

**ఆరోగ్య, పర్యావరణ సమస్యలపై ఆందోళన**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతిపాదిత పౌల్ట్రీ ఫామ్ వల్ల చింతపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తీవ్ర ఆరోగ్య, పర్యావరణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దుర్వాసన, ఈగల వ్యాప్తి, కాలుష్యం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు.

**అఖిలపక్ష నాయకుల స్పందన:**

కర్ణాటి లింగారెడ్డి (మాజీ జెడ్పీ వైస్ చైర్మన్): ప్రజలకు ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు కలిగించే ఎలాంటి నిర్మాణాలను ప్రోత్సహించబోమని తేల్చిచెప్పారు. ఈ పౌల్ట్రీ ఫామ్ నిర్మాణాన్ని నిలిపివేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి (మార్కెట్ కమిటీ చైర్మన్): ఈ సమస్య తీవ్రతను తక్షణమే స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, నిర్మాణం పూర్తిగా నిలిచిపోయేలా ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. అబ్బిడి కృష్ణారెడ్డి (మాజీ జెడ్పీటీసీ): “గ్రామస్తుల అభిప్రాయమే నా అభిప్రాయం” అని పేర్కొంటూ, ప్రజల నడుమ ఉంటూ వారి పక్షాన తుదివరకు పోరాడతానని హామీ ఇచ్చారు.

**ప్రజా ఉద్యమం, దీక్షలకు హెచ్చరిక**

సీపీఎం నాయకుడు కూనిరెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ.. పౌల్ట్రీ ఫామ్ పనులను వెంటనే స్వచ్ఛందంగా నిలిపివేయాలని, లేనిపక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మరొక నాయకుడు షేక్ అబ్బాస్ మాట్లాడుతూ, నిర్మాణం ఆపకపోతే రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**నిర్మాణ స్థలం వద్ద నిరసన కాక**

సమావేశం అనంతరం అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులు నిర్మిస్తున్న పౌల్ట్రీ ఫామ్ ప్రాంగణానికి చేరుకుని నిరసన తెలిపారు. పౌల్ట్రీ ఫామ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# త్రాగునీరు - సాగునీరు సమస్యలు కనిపించవా మంత్రిగారూ...!

- మెగా జాబ్ మేళా పేరుతో ప్రజాధనం దుర్వినియోగం
- కల్మెట్ తండా తాగునీటీ సమస్యపై గళమెత్తిన బిఆర్ఎస్ నాయకులు : పిల్లుట్ల రఘు



**హుజూర్ నగర్ సెప్టెంబర్ 22( జనంసాక్షి):** నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇక ´నైనా నియోజకవర్గంలోని నీటి సమస్యలపై దృష్టి సారించాలని, పొట్టదశలో ఉన్న వరి పంటను ఎండ బెట్టి , కనీసం త్రాగటానికి కూడా నీరు అందించలేని చేత కానీ పరిపాలన కాంగ్రెస్ పార్టీదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు ధ్వజమెత్తారు. పాలక వీడు మండలం లో కల్మెట్ తండాలో మంగళవారం త్రాగు, సాగునీటి సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు చేపట్టిన భారీ నిరసన కార్యక్రమంలో గళమెత్తారు. నియోజ కవర్గంలోని వివిధ మండలాల నుంచి తరలివచ్చి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసనకు సంఘీభావం తెలిపారు.'ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ కల్మెట్ తండా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సాగు, త్రాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నీటి పారుదల శాఖ మంత్రి నియోజకవర్గంలో త్రాగు నీటి సమస్య ఉండడం సిగ్గు చేటు,అని దుయ్యబట్టారు. ప్రజాసమస్యలు పరిష్కారం చేస్తే చాలనీ, వచ్చే ఎన్నికల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ఓడిపోవడం తథ్యమని జోస్యం చెప్పారు. ఆరు నెలలుగా కల్మెట్ తండా ప్రజలు తాగడానికి నీరు లేక అగచాట్లు పడుతున్నా ఈ నీటి శాఖ మంత్రి కి చలనం లేకపోవడం బాధాకరమన్నారు. 10 రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే హుజూర్ నగర్ లో భారీ బహిరంగ సభ పెట్టి కాంగ్రెస్ పార్టీ దద్దమ్మ పాలనను ఎండగడతామని హెచ్చరించారు. జాన్ పహాడ్, కల్మేట్ తండా చెరువులు వెంటనే నింపితే తాగు నీటి సమస్య తీరుతుందని ప్రభుత్వానికి సూచించారు. జవహర్ జాన్ పహాడ్ లిఫ్ట్ పనులు ఎప్పుడూ పూర్తవుతాయని ప్రశ్నించారు. ఆరు నెలల్లో పూర్తి చేస్తామని, మూడు సంవత్సరాలు గడుస్తున్న జాడలేదని ఎద్దేవ చేశారు. కోదాడ, హుజుర్ నగర్, పట్టణాల్లో మెగా జాబ్ మేళా పెట్టి యువతను మోసం చేస్తున్నారని తీవ్రంగా ఆరోపిస్తూ స్థానికంగా ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలకు నిరుద్యోగుల తాకిడి లేకుండా చేసేందుకే ఈ కుట్ర అని మండిపడ్డారు. జాబ్ మేళా పేరుతో బారీగా ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని, ఉత్తమ్ కుమార్ రెడ్డిని నియోజకవర్గం నుంచి తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు.

**వాటర్ ట్యాంకర్ల దగ్గర కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యనీ**

గ్రామంలో నీరు లేక అల్లాడుతున్న ప్రజలను స్థానిక కాంగ్రెస్ నాయకుల బెదిరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. తాగు నీరు పంపిణీ లో కూడా పార్టీనీ బట్టి ఇస్తున్నారని వాపోయారు. ఆరు నెలలుగా అగచాట్లు పడుతున్నా ఒక్క నాయకుడు వచ్చిన దాఖలాలు లేవని మండిపడ్డారు. ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుంటారని సమస్యలప్పుడు కనిపించరనీ ఆవేదన చెందారు. ఇకనైనా ప్రభుత్వం, స్థానిక మంత్రి తమ నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లచ్చి రెడ్డి, రాపోలు నవీన్, పెరుమాళ్ళ సతీష్, కృష్ణ నాయక్, అశోక్, రూపావత్ వెంకటేశ్వర్లు, రాజశేఖర్, నాయక్, రామారావు, రమేష్, రాంబాబు, మాజీ ఎంపీటీసీ, జెడ్పీటీసీలు ప్రజలు భారీగా పాల్గొన్నారు.



## రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** పోచంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అర్ధవార్షిక సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వాటిని పరిష్కరించే దిశగా పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు కొట్టం కరుణాకర్ రెడ్డి, జులూరు పిఏసిఎస్ చైర్మన్ కళ్లెం రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంగూరి పాండు, మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ , జూలూరు సర్పంచ్ కాసుల అంజయ్య గౌడ్ పోచంపల్లి పిఏసిఎస్ సభ్యులు సామల రాజిరెడ్డి, గుండ్ల వేణు, రావుల అనిల్, వారాల రామచంద్రారెడ్డి, చెక్క వెంకటేశం, దేశెట్ల మల్లేష్, ఆర్ల ఐలయ్య, యాట కైలాసం, పావురాల లింగమ్మ, రమావత్ చంద్రు, సారిపల్లి రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.





## ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలి

**ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న**

**రామన్నపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్థాపించి 9 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఉద్యమకారుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన "చలో యాదగిరిగుట్ట" వాల్ పోస్టర్ ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సంక్షేమం, హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఫోరం గత తొమ్మిదేళ్లుగా పలు కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలర్పించి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించి మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఫోరం ఫౌండర్, రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. వార్షికోత్సవ వేడుకలకు ఉద్యమకారులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు ఎస్కే చాంద్, బందెల రాములు, రెబ్బాసు రాములు, మండల అధ్యక్షులు నోముల శంకర్, ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, మండల నాయకులు చిందం లింగయ్య, గొలుసుల ప్రసాద్, మర్రి పరమేష్, ఏలూరి రవి, ఎండి అజార్, యాదాసు లక్ష్మణ్, ఆవుల నరేందర్, నంగునూరి విజయ్, బోయ సైదులు, కైరంకొండ సంతోష్, డాక్టర్ నకిరేకంటి అశోక్, డాక్టర్ కొండ మల్లేష్ గౌడ్, మందడి రవీందర్ రెడ్డి, మద్దెగల్ల నరసింహ, నక్క శంకరయ్య, ఎండి ఇమామ్, గడ్డం యాదగిరి, నర్రా అండాలు, శివరాత్రి లక్ష్మమ్మ, భీంపాక ఉమా, వంగాల యాదయ్య, జెట్టి శివప్రసాద్, ఆవుల లక్ష్మీనారాయణ, గర్దాస్ కరుణాకర్, రాస వెంకటేశం, లెంకల సత్యం, ఆళ్ల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫోటో ఎందుకు పెట్టరు?



**చిలుకూరు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో లేకపోవడంపై చిలుకూరు మండల బీజేపీ అధ్యక్షుడు పారెల్లి మహేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫోటో కచ్చితంగా పెట్టాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను పరిశీలించిన అనంతరం ఆయన అధికార పక్ష వైఖరిని తప్పుబడుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పారెల్లి మహేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న 6 కేజీల సన్న బియ్యంలో.. 5 కేజీల బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందని గుర్తుచేశారు. కేంద్రం ఇస్తున్న సబ్సిడీ వాటాను దాచిపెట్టి, కేవలం ముఖ్యమంత్రి, మంత్రుల ఫోటోలతో ప్రజాధనాన్ని వృథా చేస్తూ కొత్త స్మార్ట్ కార్డులను ప్రింట్ చేసుకున్నారని విమర్శించారు. ఒకవేళ స్మార్ట్ కార్డులపై ప్రధాన మంత్రి ఫోటో పెడితే కేంద్ర ప్రభుత్వ వాటా ఎంతో ప్రజలకు తెలిసిపోతుందనే భయంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. వాస్తవాలు తెలిస్తే భవిష్యత్తులో అధికార పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవనే ఆందోళనతోనే ప్రధాని ఫోటోను విస్మరించారని ధ్వజమెత్తారు. కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏళ్ల తరబడి వేచి చూస్తున్న అర్హులైన పేదలందరికీ తక్షణమే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం రేషన్ కార్డుల ఆన్‌లైన్ సర్వర్లు సరిగ్గా పనిచేయడం లేదని, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేలా సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే కొత్త రేషన్ కార్డును చేతికి అందించేలా స్పష్టమైన గడువు (ఒతిఎవ-ఎనీబీనిట) విధించాలని పారెల్లి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చెంచల శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటు



**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ చెంచల శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలో చెంచల శ్రీనివాస్ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. పార్టీ కార్యకర్తగా,పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కౌన్సిలర్‌గా ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి, కుటుంబ సభ్యులకు, అభిమానులకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## చిన్న లక్ష్మాపూర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి!

### అభివృద్ధికి అధికారుల-ప్రజాప్రతినిధుల-ప్రజల ఐక్యతే కీలకం

**తుర్కపల్లి, సెప్టెంబర్ 22: (జనం సాక్షి)** చిన్న లక్ష్మాపూర్ గ్రామాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని వీబీజీ రామ్‌జీ రాష్ట్ర స్పెషల్ కమిషనర్ లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం గ్రామంలో సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గ్రామసభ ద్వారా గుర్తించి, తీర్మానాలు చేసి పంపించాలని సూచించారు. వ్యవసాయానికి అనుసంధానంగా వాటర్ సెక్యూరిటీ, ఫామ్ పాండ్స్, సోక్ పిట్స్, పర్కొలేషన్ ట్యాంకులు, బోర్ రీచార్జ్ నిర్మాణాలు, పండ్ల తోటలు, మట్టి రోడ్లు, సీసీ రోడ్లు, పంట కాలువలు తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 164 కుటుంబాలకు సంబంధించి రూ. 86.74 లక్షల లేబర్ బడ్జెట్ ప్రతిపాదించినట్లు తెలిపారు. అనంతరం అధికారులు ఉపాధి పనుల ప్రాంతాన్ని సందర్శించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి పథకం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలని సర్పంచ్ కోమటిరెడ్డి సంతోషం భాస్కర్ రెడ్డి కోరారు.



# రామవరం రెవెన్యూ పరిధిలో భూ రీ-సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్



- రీ-సర్వే పనులను వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేయాలి
- పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూముల హద్దులను రికార్డుల ఆధారంగా నిర్ధారించాలి

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**
కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుజాతనగర్?రామవరం?గరీబ్ పేట ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి, సర్వే పురోగతి, భూ హద్దుల నిర్ధారణ, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950 ఎకరాల భూమికి రీ-సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సరిహద్దుల నిర్ధారణ చేపట్టడంతో పాటు అటవీ భూముల హద్దులను కూడా పరిశీలించినట్లు తెలిపారు. సర్వే పరిధిలో సుమారు 146 ఎకరాల మేర అటవీ భూమి ఉన్నట్లు వివరించారు.
సర్వే నంబర్లు 23, 30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే నంబర్ 20లో పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూములు కలిసి ఉన్నందున ఆయా భూముల హద్దులను రికార్డుల ఆధారంగా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అటవీ భూముల హద్దులు ఇప్పటికే నిర్ధారితంగా ఉన్న ప్రాంతాల్లో అనవసర జాప్యం లేకుండా మిగిలిన రీ-సర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.సర్వే పరిధిలో పోడు సాగు చేస్తున్న భూములు ఉన్నాయని, అర్హులైన వారికి ఆర్ ఓ ఎఫ్ ఆర్ కింద హక్కులు కల్పించినట్లు అధికారులు వివరించారు. సుమారు 420 మందికి పైగా పట్టాదారులు ఉన్నారని, ఇందులో గిరిజనులు, ఇతర వర్గాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. రీ-సర్వే ద్వారా భూ హద్దులు స్పష్టమై, హక్కుదారులకు ప్రయోజనం కలిగేలా రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు.
ఈ రోజు సమ్మక్క గద్దె సమీప ప్రాంతం నుంచి సుమారు 2.3 నుంచి 2.5 కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు వివరించారు. అక్కడ ఉన్న పాత సరిహద్దు రాళ్లు, మ్యాప్‌లు, రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ-సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా చేపట్టి నెలన్నరలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్ఐ గణపతి, లైసెన్సుడ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి: డీఆర్వో పద్మావతి

## ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో భద్రతా చర్యలు వేగవంతం చేయాలి..

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**
జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదవుతున్న రోడ్డు ప్రమాదాలు, మృతి చెందిన వారు, గాయపడిన వారి వివరాలతో పాటు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. జనవరి 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు జిల్లాలో మొత్తం 370 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదాల్లో 176 మంది మృతి చెందగా, 23 మంది తీవ్రంగా, 344 మంది స్వల్పంగా గాయపడ్డారు. రోడ్డు ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని డీఆర్వో పద్మావతి సూచించారు.
సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు జిల్లాలో 21 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. ఈ ప్రమాదాల్లో 12 మంది మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా, 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. మరో 17 మంది ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. ఇటీవలి కాలంలో ప్రమాదాల పరిస్థితిని పరిశీలించి, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్వో సూచించారు.
జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ రోడ్డు భద్రతా చర్యలను తక్షణమే చేపట్టాలని ఆమె ఆదేశించారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లపై ఉన్న ప్రమాదకర మలుపులు, కూడళ్లు, ఇతర సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు.
వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్వో పద్మావతి సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదాలకు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రత విషయంలో సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రమాదాల సంఖ్యను, మృతి, గాయాల సంఖ్యను తగ్గించేలా చర్యలు చేపట్టాలని డీఆర్వో పద్మావతి పేర్కొన్నారు.
ఈ సమావేశంలో డీఎస్పీ వెంకన్న బాబు, డీఆర్ఎం బాలాజీ, ఆర్అండ్‌బీ ఈఈ, డీఈఈ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, రవాణా శాఖ ఏఎంవీఐ, పోలీస్ సీఐ రాజు, మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

## శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు 1,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే ప్రధాన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, రద్దీ ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం నిమజ్జనం ఘాట్ వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఘాట్ పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి, రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్, శోభాయాత్రల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు.



ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. శోభాయాత్ర ల్లో డీజేలు, అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్, టపాసులకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని, నిమజ్జన సమయంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, అత్యవసర సేవల బృందాలు, రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన నీటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో బ్లూకోట్స్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీస్, అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వాహకులు, శోభాయాత్ర నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# మారెళ్లపాడుకు ముగ్గురు మంత్రుల రాక!

## 23న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవం.

## పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం.

**అశ్వాపురం సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 23న అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడులో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నలమాడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారు. అధికారిక పర్యటన షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు మారెళ్లపాడు గ్రామానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరుకోనుండగా, 12.15 గంటల నుంచి 1.45 గంటల వరకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది.

**ప్రారంభోత్సవానికి అధికారిక షెడ్యూల్ ఖరారు:**
రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనలో భాగంగా మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవాన్ని అధికారికంగా షెడ్యూల్ చేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

**అశ్వాపురం రైతుల్లో ఆసక్తి:**
మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవానికి ముగ్గురు రాష్ట్ర మంత్రులు హాజరుకానుండటంతో కార్యక్రమంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టాలని అధికారిక ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు కార్యక్రమానికి హాజరయ్యేలా సమాచారం అందించాలని సూచించారు.మారెళ్లపాడు వేదికగా జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు.